E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం :

9959812941-9949356387

PUBLISHED: TELANGANA    సంపుటి :01    సంచిక :153    మంగళవారం 12 మే 2026    ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్    పేజీలు: 08    వెల :05/-

# 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' లక్ష్యం: చంద్రబాబు



న్యూఢిల్లీ, మే 11:

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దేశ రాజధాని ఢిల్లీలో సుడిగాలి పర్యటన చేపట్టారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా, విభజన హామీల అమలు మరియు అభివృద్ధి ప్రాజెక్టులకు నిధుల సాధనే లక్ష్యంగా ఆయన పర్యటన సాగింది. ఉదయం నుంచి రాత్రి వరకు అత్యంత బిజీ షెడ్యూల్‌తో గడిపిన ముఖ్యమంత్రి, కేంద్రంలోని కీలక మంత్రులతో భేటీ కావడమే కాకుండా, పారిశ్రామిక దిగ్గజాలతో నిర్వహించిన సీఐఐ వార్షిక సదస్సులో తనదైన ముద్ర వేశారు.

### హోంమంత్రితో కీలక భేటీ

పర్యటనలో భాగంగా తొలుత కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. దాదాపు గంటకు పైగా సాగిన ఈ సమావేశంలో రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులతో పాటు, పెండింగ్‌లో ఉన్న విభజన సమస్యల పరిష్కారంపై సుదీర్ఘంగా చర్చించారు. ఏపీకి రావాల్సిన నిధులు, పారిశ్రామిక రాయితీలు మరియు వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీపై హోంమంత్రికి వివరించారు. దీనిపై కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

### పోలవరంపై ప్రత్యేక దృష్టి

అనంతరం కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో చంద్రబాబు సమావేశమయ్యారు. రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత స్థితిగతులు, పనుల వేగవంతం మరియు నిధుల విడుదలపై చర్చించారు. ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన సాంకేతిక సాయం, నిధుల సర్దుబాటుపై మంత్రి సానుకూల హామీ ఇచ్చారు. నీటి వనరుల యాజమాన్యంలో ఏపీని అగ్రగామిగా నిలబెడతామని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

మిగతా 2లో..

# భారతదేశంలోనే మోడల్ టౌన్ షిప్ గా అమరావతి



సింగపూర్‌లోని పుంగోల్ జిల్లా తరహాలో అమరావతిలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్... ఏపీలోని ఇతర పట్టణ ప్రాంతాలకు మాత్రమే కాకుండా, భారతదేశంలోనే ఒక మోడల్ టౌన్ షిప్ గా నిలుస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఇందుకోసం ప్రపంచ బ్యాంకు నుండి అవసరమైన మద్దతు తీసుకోవడంతో పాటు విధివిధానాలను ఖరారును వేగవంతంగా చేయాల్సిందిగా జాయింట్ ఇంప్లిమెంటేషన్ వర్కింగ్ కమిటీని కోరారు. రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం... సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ప్రతినిధులతో సింగపూర్ లో సమావేశమైంది. ఈ సమావేశంలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మీ మద్దతుతో అమరావతి ఆర్థిక ప్రాంతాన్ని అత్యుత్తమంగా అభివృద్ధి చేయాలని మేము కోరుకుంటున్నాం. అమరావతి ఎకనమిక్ రీజియన్ అభివృద్ధిలో ఆసక్తిగల భాగస్వాములను ఆహ్వానిస్తూ ప్రతిపాదనల కోసం అభ్యర్థన పై ఇప్పటికే నోటిఫికేషన్ జారీచేశాం. అమరావతి రాజధానికి ఇప్పుడు జాతీయ చట్టబద్ధత ఉంది. దీనివల్ల ఈ ప్రాంతంలో పెట్టుబడులకు ఇన్వెస్టర్లలో విశ్వాసాన్ని పెంచుతుందని అన్నారు.

2 లో

# బండి సంజయ్ కొడుకు కేసు దర్యాప్తు వేగవంతం



హైదరాబాద్, :

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. ఈ కేసు దర్యాప్తుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా సమీక్ష నిర్వహించారు. మహిళలు, చిన్నారుల భద్రత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేసిన సీఎం.. ఈ కేసు దర్యాప్తును అత్యంత వేగవంతం చేయాలని పోలీసు ఉన్నతాధికారులను గట్టిగా ఆదేశించారు. చట్టం ముందు ఎవరైనా సమానమేనని, ఎటువంటి ఒత్తిళ్లకు లొంగకుండా విచారణ జరపాలని ఆయన హెచ్చరించారు.

### సైబరాబాద్ సీపీ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం ముగిసిన వెంటనే సైబరాబాద్ పోలీస్ యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ కేసు పర్యవేక్షణ బాధ్యతలను స్వీకరించాలని సైబరాబాద్ సీపీ నుండి ఆదేశాలు అందిన గంట వ్యవధిలోనే డీసీపీ రితిరాజ్ రంగంలోకి దిగారు. కేసు దర్యాప్తును నేరుగా తన పర్యవేక్షణలోకి తీసుకున్న ఆమె, తక్షణమే విచారణ ప్రక్రియను ప్రారంభించారు.

మిగతా 2లో..

# ఘనంగా 'విద్యా వారోత్సవాలు'

హైదరాబాద్, మే 11: రాష్ట్ర రాజధానిలోని చారిత్రాత్మక ఎల్బీ స్టేడియం విద్యార్థుల కేరింతలు, ఉపాధ్యాయుల ఉత్సాహంతో మార్మోగింది. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'విద్యా వారోత్సవాల' ముగింపు సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పేద విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని ప్రకటించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో విద్యార్థులే కీలక భాగస్వాములని ఆయన పిలుపునిచ్చారు.

### మౌలిక వసతుల కల్పనే ప్రాధాన్యత

ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. గతంలో నిర్లక్ష్యానికి గురైన విద్యా వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. "పాఠశాలల్లో కేవలం భవనాలు మాత్రమే కాదు, నాణ్యమైన బోధన, డిజిటల్ విద్య కూడా అందుబాటులోకి రావాలి. రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి చదువుకునే హక్కును, అవకాశాన్ని కల్పించడం మా బాధ్యత" అని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ నియామక ప్రక్రియలను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

### రాజకీయ సంకల్పం - విద్యా ప్రగతి

విద్యా వారోత్సవాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా చదువుపై అవగాహన కల్పించడం సంతోషకరమని ముఖ్యమంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఉన్నతాధికారులతో పాటు భారీగా విద్యార్థులు పాల్గొన్నారు. విద్యా రంగాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని, బడ్జెట్‌లో విద్యకు అగ్రతాంబూలం ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ వారోత్సవాల స్ఫూర్తితో ప్రతి పాఠశాల ఒక దేవాలయంలా వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

# చెరువుల చెంత హైడ్రా సీసీటీవీ నిఘా



2 లో

హైదరాబాద్, మే 11: చెరువుల పరిరక్షణకు హైడ్రా పటిష్టమైన నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసింది. మట్టితో నింపి కబ్జా చేయాలనే ప్రయత్నాలకు చెక్ పెట్టింది. చెరువుల చెంత సీసీటీవీ కెమేరాలు పెట్టి గట్టి నిఘా ఏర్పాటు చేసింది. వీటిని హైడ్రా కార్యాలయంలోని సర్వర్‌కు అనుసంధానించింది. నిరంతరం చెరువుల చెంత ఏం జరుగుతుందో తెలుసుకునే వ్యవస్థను హైడ్రా కార్యాలయం నుంచే పర్యవేక్షించేలా ఏర్పాటు చేసింది. సీసీటీవీ కెమేరా నిఘా వ్యవస్థను సోమవారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రారంభించారు. చెరువులలో మట్టి పోయకుండా.. ఆక్రమణలు జరగకుండా ఇప్పటికే లేక్ ప్రొటెక్షన్ టీమ్‌లు పర్యవేక్షిస్తున్నాయి. వీటికి తోడు సీసీటీవీ కెమేరా వ్యవస్థ అదనంగా అందుబాటులోకి వచ్చినట్టయ్యింది.

# న్యాయ వ్యవస్థలో డిజిటల్ విప్లవం

## 'వన్ కేస్, వన్ డేటా' విధానాన్ని ప్రకటించిన సీజేఐ




2 లో


దేశవ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయస్థానాల కేసుల డేటాను ఒకే గొడుగు కిందకు తెచ్చే లక్ష్యంతో సుప్రీంకోర్టు సరికొత్త డిజిటల్ వ్యవస్థను ప్రారంభించింది. సోమవారం కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాగానే, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ ప్రతిష్టాత్మకమైన 'వన్ కేస్, వన్ డేటా' విధానంతో పాటు 'సు-సహాయ్' అనే ఏఐ ఛాట్‌బాట్‌ను ఆవిష్కరించారు.

వన్ కేస్.. వన్ డేటా సిస్టమ్ ఇదే..

భారత్‌లో ఉన్న వివిధ కోర్టుల మధ్య సమాచార అంతరాన్ని తగ్గించడానికి ఈ వ్యవస్థను రూపొందించారు.

# భవిష్యత్ సాంకేతిక రంగాల్లో యువతకు భారీ అవకాశాలు

- డీప్ టెక్ స్కిల్లింగ్‌తో అందుబాటులోకి ప్రపంచ స్థాయి టెక్నాలజీ
- టెక్నాలజీ డే సందర్భంగా ఏపీలో భారీ డీప్‌టెక్ స్కిల్లింగ్ మిషన్
- NPTEL పరీక్షల్లో సత్తా చాటిన ఏపీ విద్యార్థులకు అభినందనలు
- నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా ఎక్స్ వేదికగా తన అభిప్రాయాలు పంచుకున్న సీఎం చంద్రబాబు



2 లో

# మరో ట్విస్ట్ ఇచ్చిన విజయ్ స్టాలిన్‌తో భేటీకి నిర్ణయం!




తమిళనాడు రాజకీయాల్లో సినిమాలను తలపించే ట్విస్టులు నమోదు అవుతున్నాయి. కొత్త ప్రభుత్వం కొలువుదీరాక సీఎం విజయ్ తీసుకుంటున్న నిర్ణయాలు సంచలనంగా మారాయి. సీఎంగా తన తొలి స్పీచ్‌లోనే గత ప్రభుత్వం చేసిన అప్పులపై సంచలన ఆరోపణలు చేసిన విజయ్ సోమవారం మరో ట్విస్ట్ ఇచ్చారు. ఆయన త్వరలో మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే అధ్యక్షుడు ఎం.కె.స్టాలిన్‌తో భేటీ కానున్నట్లు తెలుస్తోంది. కొత్త ప్రభుత్వం ఏర్పాటు చేసిన నేపథ్యంలో మర్యాదపూర్వకంగా స్టాలిన్‌ను కలవాలని నిర్ణయించుకున్నట్లు తమిళ మీడియా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.

బలనిరూపణ కోసమా మర్యాద కోసమా?:

స్టాలిన్ తో భేటీ కావాలన్న విజయ్ ఆలోచన వెనుక అసలు వ్యూహం ఏంటనేది ఆసక్తిగా మారింది. టీవీకే సహా మొత్తం ఆరు పార్టీలతో మద్దతుతో విజయ్ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ మేరకు మొత్తం 120 మంది సభ్యుల బలాన్ని గవర్నర్ కు చూపించి సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిన గవర్నర్ ఆర్లేకర్ ఈ నెల 13వ తేదీన అసెంబ్లీలో బలనిరూపణ ద్వారా మెజారిటీ చూపాలని గవర్నర్ సూచించారు. ఈ నేపథ్యంలో తమ ప్రత్యర్థి డీఎంకే చీఫ్ తో విజయ్ భేటీ కాబోతున్నారనే ప్రచారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాశంగా మారింది. మర్యాదపూర్వకంగానే స్టాలిన్‌తో విజయ్ భేటీ కావాలని నిర్ణయించుకున్నారా లేక బలనిరూపణ విషయంలో ఎలాంటి తేడా జరగకుండా ఉండేందుకు ఈ ఎత్తుగడ వేశారా అనేది ఉత్కంఠగా మారింది. ఇదే నిజమైతే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విజయ్ కు ఇది తొలి కీలక రాజకీయ భేటీ కానుంది. తమిళనాడులో కొత్త ప్రభుత్వానికి ఇది ఆసక్తికరమైన ప్రారంభంగా మారబోతోంది అనే టాక్ వినిపిస్తోంది.

# కాంగ్రెస్‌ను ముస్లిం లీగ్, మావోయిస్టులతో పోలుస్తారా?

## మోడీపై వీహెచ్ ధ్వజం



2 లో

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనలో చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా హాట్ టాపిక్ అవుతున్నాయి. మోడీ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఎంఎంసి (ముస్లిం లీగ్ - మావోయిస్ట్ కాంగ్రెస్) అని సంబోధించడాన్ని తాజాగా ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ తప్పుబట్టారు. దేశం కోసం ప్రాణాలర్పించి చరిత్ర కలిగిన పార్టీని ఇలాంటి పేర్లతో పిలవడం ప్రధాని పదవికి తగదని ఆయన విమర్శించారు.

# 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' లక్ష్యం: చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి



### సీఐఐ సదస్సులో ఆకర్షణీయ ప్రసంగం

భారత పరిశ్రమల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన వార్షిక వ్యాపార సదస్సులో చంద్రబాబు ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గతంలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'పై దృష్టి సారించామని, ఇప్పుడు దానికి 'స్పీడ్'ను జోడించి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానాన్ని అమలు చేస్తున్నట్లు పారిశ్రామికవేత్తలకు వివరించారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ స్వర్గధామమని, పారిశ్రామిక వేత్తలకు ప్రభుత్వం ఎర్ర తివాచీ పరుస్తుందని పిలుపునిచ్చారు.

### స్వయం సమృద్ధి దిశగా పిలుపు

దేశ ప్రధాని మోదీ సూచించిన విధంగా ఇంధన పొదుపు, సహజ వ్యవసాయం మరియు విదేశీ మారక ద్రవ్య నిల్వలను పెంచుకోవడం వంటి అంశాలపై ప్రజలందరూ ఒక 'మిషన్'లా పనిచేయాలని చంద్రబాబు కోరారు. ముఖ్యంగా బంగారం కొనుగోళ్లను వాయిదా వేసుకోవడం, ప్రజా రవాణా వినియోగించడం వంటి అంశాలపై ఆయన చేసిన వ్యాఖ్యలు సదస్సులో అందరినీ ఆకట్టుకున్నాయి. భారత్ ప్రపంచంలో మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే క్రమంలో ఏపీ ముందు వరుసలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.

### ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో భేటీ

అమరావతి రాజధాని నిర్మాణం మరియు ఇతర మౌలిక వసతుల కల్పన కోసం ప్రపంచ బ్యాంకు ప్రతినిధులతో ముఖ్యమంత్రి కీలక చర్చలు జరిపారు. రాష్ట్రంలో చేపట్టబోయే మెగా ప్రాజెక్టులకు ఆర్థిక తోడ్పాటు అందించాలని కోరారు. రాజధాని నిర్మాణంలో అత్యాధునిక సాంకేతికతను జోడించి, ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఆయన వివరించారు.

### నవ్యాంధ్ర పునర్నిర్మాణమే లక్ష్యం

నీతి ఆయోగ్ సభ్యులు మరియు ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ప్రతినిధులతో కూడా ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెట్టేందుకు కేంద్రం నుంచి అందాల్సిన సహాయ సహకారాలపై వివరణాత్మక నివేదికలు అందజేశారు. మొత్తానికి చంద్రబాబు ఢిల్లీ పర్యటన రాష్ట్రానికి భారీ పెట్టుబడులు, నిధులు వచ్చే దిశగా సానుకూల ఫలితాలను ఇచ్చేలా కనిపిస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### అస్సాం పర్యటనకు సిద్ధం

ఢిల్లీలో తన కార్యక్రమాలను ముగించుకున్న ముఖ్యమంత్రి, మంగళవారం ఉదయం అస్సాం వెళ్లనున్నారు. అక్కడ జరిగే నూతన ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరై, అనంతరం తిరిగి అమరావతికి చేరుకోనున్నారు. ఈ రెండు రోజుల పర్యటన రాష్ట్ర అభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# భారతదేశంలోనే మోడల్ టౌన్ షిప్ గా అమరావతి

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ నుంచి... సింగపూర్ ద్వారా ఆగ్నేయాసియా, తూర్పు ఆసియాల మధ్య వాణిజ్యాన్ని సులభతరం చేయడానికి గల అవకాశాలను పరిశీలించండి. సింగపూర్ తరహాలో ఆంధ్రప్రదేశ్ కూడా ఒక గ్లోబల్ గమ్యస్థానంగా మారాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా అలాంటిది ఏర్పాటుచేసేందుకు సింగపూర్ సన్‌టెక్ సిటీని అధ్యయనం చేస్తాం. ఆంధ్రప్రదేశ్‌లో రియల్ టైమ్ గవర్నెన్స్ ను బలోపేతం చేయడానికి సింగపూర్ అనుభవాన్ని ఇకముందు కూడా ఉపయోగించుకుంటాం. ఆంధ్రప్రదేశ్ లో పెట్టుబడి పెట్టిన, పెట్టడానికి సుముఖత వ్యక్తం చేస్తున్న కంపెనీలకు సానుకూల వాతావరణం ఏర్పాటు చేస్తామని లోకేష్ అన్నారు.

మన రెండు ప్రభుత్వాల నడుమ ఇప్పుడు పటిష్టంగా భాగస్వామ్యం ఏర్పడింది. ఎంవోయులోని అంశాల అమలుపై వర్కింగ్ గ్రూపుల ద్వారా ప్రతినెలా సంప్రదింపులు జరుగుతూనే ఉన్నాయి. ఏపీ ప్రభుత్వానికి చెందిన ఆరుగురు మంత్రులు రెండు వారాల క్రితం సింగపూర్ -- ఏపీ గవర్నెన్స్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో భాగంగా వారంరోజులపాటు శిక్షణా తరగతులకు హాజరై పరిపాలనలో తమ అనుభవాలను పంచుకున్నారు. ఏపీకి చెందిన 37 మంది ప్రభుత్వ ఉపాధ్యాయులు కూడా తాజాగా శిక్షణను పూర్తి చేసుకున్నారు. వారి అనుభవాన్ని, శిక్షణలో నేర్చుకున్న అంశాలను మా విద్యా వ్యవస్థలో పొందుపరుస్తాం. గత సమావేశంలో చర్చించిన అజెండా అంశాలపై వర్కింగ్ గ్రూప్ విస్తృతంగా పనిచేసింది. ఇప్పుడు ఆ పటిష్టమైన పునాదిపై మరింత ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని మంత్రి లోకేష్ చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ లో ఇంటిగ్రేటెడ్ మోడల్ టౌన్‌షిప్, అమరావతి ఎకనామిక్ రీజియన్, డిజిటల్ ట్రాన్సఫర్మేషన్/రియల్ టైమ్ గవర్నెన్స్ పై గత నవంబర్ లో సింగపూర్ ప్రభుత్వంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఎంవోయు పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్షించేందుకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ స్టీరింగ్ కమిటీ ఏర్పాటుచేశారు. జెఐఎస్ సీ ఆమోదించిన పనులను ముందుకు నడిపించేందుకు జాయింట్ ఇంప్లిమెంటేషన్ వర్కింగ్ కమిటీ ని కూడా ఏర్పాటు చేశారు. వీటితోపాటు గతంలో పెండింగ్‌లో ఉన్న అంశాల పురోగతిపై తాజా సమాచారం, భవిష్యత్ కార్యాచరణ అంశాలపై సింగపూర్ లో తాజాగా ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.



ఈ సమావేశంలో సింగపూర్ వాణిజ్యం, పరిశ్రమలు, విదేశాంగశాఖ మంత్రి గాన్ సియో హువాంగ్, సింగపూర్ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వశాఖ సీనియర్ డైరెక్టర్ ఫ్రాన్సిస్ చోంగ్, సింగపూర్ కో-ఆపరేషన్ ఎంటర్ ప్రైజ్ (SCE) డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టే లియాన్ చూ, ఎంటర్ ప్రైజ్ సింగపూర్ సౌత్ ఆసియా ఎకనమిక్ డెవలప్ మెంట్ డైరెక్టర్ ఆడ్రీ టాన్, సింగపూర్ కో-ఆపరేషన్ ఎంటర్ ప్రైజ్ మిడిల్ ఈస్ట్, నార్త్ ఆసియా డిప్యూటీ డైరెక్టర్ లిమ్ చీ కియా, మినిస్ట్రీ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ డైరెక్టర్ జీన్ యీ, సింగపూర్ కోఆపరేషన్ ఎంటర్ ప్రైజ్ సీనియర్ మేనేజర్ (మిడిల్ ఈస్ట్, నార్త్ ఆసియా) నిషా శారద, భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, ఎస్.జోషి, ఏపీ ప్రభుత్వం తరపున సీనియర్ ఐఏఎస్ అధికారులు దత్తి సురేంద్ర, అనంత శంకర్, పీయూష్ కుమార్, కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌ను ముస్లిం లీగ్, మావోయిస్టులతో పోలుస్తారా? మోడీపై వీహెచ్ ధ్వజం

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటనలో చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా హాట్ టాపిక్ అవుతున్నాయి. మోడీ కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఎంఎంసి (ముస్లిం లీగ్ - మావోయిస్ట్ కాంగ్రెస్) అని సంబోధించడాన్ని తాజాగా ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ తప్పుబట్టారు. దేశం కోసం ప్రాణాలర్పించి చరిత్ర కలిగిన పార్టీని ఇలాంటి పేర్లతో పిలవడం ప్రధాని పదవికి తగదని ఆయన విమర్శించారు. మావోయిస్టుల హింస వల్లే కారణంగానే ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ప్రాణత్యాగం చేశారన్నారు. అలాంటిది మావోయిస్టులతో కాంగ్రెస్‌ను ముడిపెట్టడం అన్యాయం అన్నారు. ఇక దేశ స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింలు సైతం కీలక పాత్ర పోషించారని వారిని కించపరిచేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. ప్రధాని వ్యాఖ్యలపై పోలీసులపై చట్టప్రకారం చర్యలు తీసుకునేలా పోలీసులను కలిసి ఫిర్యాదు చేస్తానన్నారు. ఓబీసీలను కూడా కులగణనలో చేర్చకపోతే ఎవరూ ఈ జనగణనలో పాల్గొనవద్దని ఓబీసీలకు విజ్ఞప్తి చేశారు.

# బండి సంజయ్ కొడుకు కేసు దర్యాప్తు వేగవంతం

మొదటి పేజీ తరువాయి

### పోలీస్ స్టేషన్‌లో రికార్డుల పరిశీలన

కేసు పర్యవేక్షణ అధికారిగా డీసీపీ రితిరాజ్ బుధవారం పేట్ బషీర్ బాద్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఇప్పటి వరకు జరిగిన దర్యాప్తు నివేదికలను, నమోదైన సాక్ష్యాధారాలను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. కేసు తీవ్రత దృష్ట్యా ప్రతి అంశాన్ని నిశితంగా విశ్లేషిస్తున్నారు. ఈ కేసులో సాంకేతిక ఆధారాల సేకరణపై కూడా డీసీపీ ప్రత్యేక దృష్టి సారించారు.

### మరోసారి బాధితురాలి స్టేట్‌మెంట్

కేసు నమోదైన ప్రాథమిక దశలో పోలీసులు ఒకసారి బాధితురాలి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అయితే, కేసులో మరింత స్పష్టత కోసం, మరికొంత సమాచారం సేకరించాల్సి ఉందని డీసీపీ రితిరాజ్ తెలిపారు. దీనికోసం బాధితురాలి స్టేట్‌మెంట్‌ను మరోసారి రికార్డు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. బాధితురాలికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా చట్టప్రకారం ఈ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

### ముమ్మరంగా కాల్ డేటా విశ్లేషణ

సాంకేతిక ఆధారాల్లో భాగంగా నిందితుడు బండి సాయి భగీరథ్‌కు సంబంధించిన కాల్ డేటా రికార్డ్స్ ను పోలీసులు ప్రస్తుతం విశ్లేషిస్తున్నారు. ఘటన జరిగిన సమయంలో నిందితుడు ఎక్కడ ఉన్నాడు? ఎవరెవరితో సంభాషించాడు? అనే కోణంలో లోతైన దర్యాప్తు జరుగుతోంది. ఈ డేటా ఆధారంగా కేసులో మరిన్ని కీలక మలుపులు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.

### అరెస్ట్‌కు వెనుకాడబోం: డీసీపీ

ఈ సందర్భంగా డీసీపీ రితిరాజ్ మీడియాకు కీలక వివరాలు వెల్లడించారు. "చట్టం తన పని తాను చేసుకుపోతుంది. ఈ పోక్సో కేసులో లోతైన దర్యాప్తు చేస్తున్నాం. విచారణలో నిందితుడు తప్పు చేసినట్లు ప్రాథమికంగా ఆధారాలు దొరికితే, నిందితుడు ఎంతటి వారైనా సరే.. ఖచ్చితంగా బండి సాయి భగీరథ్‌ను అరెస్ట్ చేస్తాం" అని ఆమె స్పష్టం చేశారు.



బాధితురాలికి న్యాయం జరిగేలా చట్టపరమైన అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

### రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

ముఖ్యమంత్రి ఆదేశాలు, డీసీపీ స్థాయి అధికారి స్వయంగా రంగంలోకి దిగడంతో ఈ కేసు దర్యాప్తులో పోలీసులు అత్యంత దూకుడు ప్రదర్శిస్తున్నారు. కేంద్ర మంత్రి కుమారుడి చుట్టూ పోక్సో ఉచ్చు బిగుస్తుండటం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. రానున్న 24 గంటల్లో పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోబోతున్నారనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

# చెరువుల చెంత హైడ్రా సీసీటీవీ నిఘా

మొదటి పేజీ తరువాయి



చెరువుల్లో ఎవరైనా నిర్మాణ వ్యర్థాలు వేసినా.. మట్టితో నింపేందుకు ప్రయత్నించినా..కబ్జాలు చేసినా సీసీటీవీ కెమేరాల ద్వారా తెలుసుకునే వెసులుబాటు హైడ్రాకు లభించింది. హైడ్రా కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూం నుంచి మోనిటర్లద్వారా నిరంతరం పరిశీలిస్తారు. మట్టిని తెచ్చి పోసిన పక్షంలో ఆ వాహనం వివరాలను తెలుసుకోవడంతో పాటు.. అక్కడే ఉన్న లేక్ ప్రొటెక్షన్ టీమ్‌ను కూడా అప్రమత్తం చేస్తారు. బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో ఉన్న మోనిటర్లకు కూడా చెరువుల చెంత హైడ్రా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమేరాలను అనుసంధానం చేశారు. దీంతో నిఘా మరింత పటిష్టంగా ఉంటుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. హైడ్రా అదనపు సంచాలకులు వర్ల పాపయ్య తో పాటు అదనపు కమిషనర్ ఆర్ సుదర్శన్ కూడా సీసీటీవీ వ్యవస్థను ప్రారంభించిన వారిలో ఉన్నారు.

# న్యాయ వ్యవస్థలో డిజిటల్ విప్లవం

## 'వన్ కేస్, వన్ డేటా' విధానాన్ని ప్రకటించిన సీజేఐ

దేశవ్యాప్తంగా ఉన్న అన్ని న్యాయస్థానాల కేసుల డేటాను ఒకే గొడుగు కిందకు తెచ్చే లక్ష్యంతో సుప్రీంకోర్టు సరికొత్త డిజిటల్ వ్యవస్థను ప్రారంభించింది. సోమవారం కోర్టు కార్యకలాపాలు ప్రారంభం కాగానే, భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ ప్రతిష్టాత్మకమైన 'వన్ కేస్, వన్ డేటా' విధానంతో పాటు 'సు-సహాయ్' అనే ఏఐ ఛాట్‌బాట్‌ను ఆవిష్కరించారు.

వన్ కేస్.. వన్ డేటా సిస్టమ్ ఇదే..

భారత్‌లో ఉన్న వివిధ కోర్టుల మధ్య సమాచార అంతరాన్ని తగ్గించడానికి ఈ వ్యవస్థను రూపొందించారు. దీంతో ద్వారా సుప్రీంకోర్టు, హైకోర్టులు, జిల్లా కోర్టులు, తాలూకా కోర్టుల డేటా అంతా లింక్ చేయనున్నారు. ఒక కేసు కింది కోర్టు నుంచి పై కోర్టుకు వెళ్లినప్పుడు, ఆ కేసు పూర్తి వివరాలు, పూర్వాపరాలను అధికారులు, న్యాయమూర్తులు సులభంగా యాక్సెస్ చేయవచ్చు. కేసుల ప్రస్తుత స్థితి వెరిఫై చేయడం ఇప్పుడు మరింత వేగవంతం, సులభం కానుంది. భారతదేశ చరిత్రలో ఇలాంటి సమగ్ర డేటా ఇంటిగ్రేషన్ జరగడం ఇదే తొలిసారి అని సీజేఐ సూర్యకాంత్ పేర్కొన్నారు.

'సు-సహాయ్' ఏఐ ఛాట్‌బాట్

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ సహకారంతో సుప్రీంకోర్టు రిజిస్ట్రీ అభివృద్ధి చేసిన 'సు-సహాయ్' అనే ఏఐ ఆధారిత అసిస్టెన్స్ ఛాట్‌బాట్‌ను కూడా సీజేఐ ప్రారంభించారు. ఇది సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది. కక్షిదారులు, న్యాయవాదులు సుప్రీంకోర్టు సేవలను ఎలా పొందాలో, గైడ్‌లైన్స్ ఏమిటో తెలుసుకోవడానికి ఈ ఛాట్‌బాట్ సులభమైన ఇంటర్‌ఫేస్‌ను అందించనుంది. ఈ సందర్భంగా సీజేఐ మాట్లాడుతూ.. ఈ సాంకేతిక పరిజ్ఞానం వల్ల న్యాయ ప్రక్రియలో జాప్యం తగ్గుతుందని, న్యాయం అందరికీ మరింత సులభంగా అందుబాటులోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవల సిక్కింను దేశంలోనే మొట్టమొదటి 'పేపర్‌లెస్ జుడిషియరీ'గా ప్రకటించిన సీజేఐ, ఇప్పుడు దేశవ్యాప్త డేటా ఇంటిగ్రేషన్‌తో మరో ముందడుగు వేశారు.





# భవిష్యత్ సాంకేతిక రంగాల్లో యువతకు భారీ అవకాశాలు

- డీప్ టెక్ స్కిల్లింగ్‌తో అందుబాటులోకి ప్రపంచ స్థాయి టెక్నాలజీ
- టెక్నాలజీ డే సందర్భంగా ఏపీలో భారీ డీప్‌టెక్ స్కిల్లింగ్ మిషన్
- NPTEL పరీక్షల్లో సత్తా చాటిన ఏపీ విద్యార్థులకు అభినందనలు
- నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా ఎక్స్ వేదికగా తన అభిప్రాయాలు పంచుకున్న సీఎం చంద్రబాబు

జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా భారత భవిష్యత్తును సాంకేతికత, ఆవిష్కరణల ద్వారా నిర్మిస్తున్న శాస్త్రవేత్తలు, ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, యువతకు హృదయపూర్వక శుభాకాంక్షలు. ఇవాళ భారత శాస్త్రీయ విజయాలను స్మరించుకునే రోజు. పోఖ్రాన్ విజయాన్ని గుర్తు చేసుకునే రోజు. పోఖ్రాన్ విజయంతో మన దేశ సామర్థ్యాన్ని, శక్తిని, ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పాం. నాలెడ్జ్, రీసెర్చ్, ఇన్నోవేషన్స్, హ్యూమన్ రిసోర్సెస్ వంటి అంశాలతో స్థిరమైన అభివృద్ధి సాధ్యమనే విషయాన్ని పోఖ్రాన్ విజయం నిత్యం గుర్తు చేస్తూనే ఉంటుంది. ఆ దిశగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అడుగులు వేస్తోంది. భవిష్యత్ సాంకేతిక రంగాల్లో బలమైన ఎకోసిస్టమ్‌ను నిర్మిస్తూ, ఆవిష్కరణలకు అనుకూల వాతావరణాన్ని పెంపొందించేందుకు రాష్ట్రం కట్టుబడి ఉంది.

ఈ సందర్భంగా IBM SkillsBuild, APSCHE, APSSDC, అమరావతి క్వాంటమ్ వ్యాలీతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయి డీప్-టెక్ స్కిల్లింగ్ శిక్షణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని ప్రకటించడం ఎంతో ఆనందంగా ఉంది. క్వాంటమ్ టెక్నాలజీస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి రంగాలను కవర్ చేస్తూ 2026--27 నాటికి 2 లక్షల మంది విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నాం. అలాగే వచ్చే ఐదేళ్లలో 10 లక్షల మందికి శిక్షణ ఇచ్చే లక్ష్యంతో శిక్షణ కార్యక్రమం రూపొందించాం. డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంలు, పరిశ్రమలతో అనుసంధానమైన శిక్షణ, అంతర్జాతీయ గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ల ద్వారా ఈ ప్రోగ్రామ్ అమలు చేస్తున్నాం. ఈ టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేసేలా నాగార్జున యూనివర్శిటీలో NIELIT ఇన్నోవేషన్ & స్కిల్లింగ్ సెంటర్ కీలక పాత్ర పోషించనుంది. క్వాంటమ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటమ్ కమ్యూనికేషన్, సెమీకండక్టర్ టెక్నాలజీలపై ఈ కేంద్రం ప్రత్యేక దృష్టి సారించనుంది. ఈ విద్యా సంవత్సరంలోనే కార్యకలాపాలు ప్రారంభం కానున్నాయి. దీని ద్వారా ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, అత్యాధునిక ప్రయోగశాలలు, పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన శిక్షణ అందుబాటులోకి వస్తుంది. దీంతో వేలాది మంది విద్యార్థులు, పరిశోధకులు, ఆవిష్కర్తలు లబ్ధి పొందనున్నారు.



# మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం రద్దు త్వరలో అమల్లోకి వీబీ-జి రామ్ జి చట్టం

కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ఉపాధి కల్పన కోసం ప్రతిష్టాత్మకమైన 'వికసిత్ భారత్ – గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ) చట్టం, 2025' (వీబీ–జి రామ్ జి–2025) అమలుకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది జూలై 1 నుంచి దేశవ్యాప్తంగా ఈ కొత్త చట్టం అమల్లోకి రానుంది. 20 ఏళ్ల క్రితం నాటి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 2005 స్థానంలో ఈ కొత్త ఫ్రేమ్‌వర్క్‌ను ప్రభుత్వం తీసుకువచ్చింది. 2047 నాటికి 'వికసిత్ భారత్' లక్ష్యాన్ని చేరుకోవడంలో భాగంగా ఈ మార్పులు చేసినట్లు గ్రామీణ అభివృద్ధి మంత్రిత్వ శాఖ పేర్కొంది.

గ్రామీణ కార్మికులకు మరింత భరోసా

ఈ కొత్త చట్టం ప్రకారం.. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి కుటుంబానికి ఒక ఆర్థిక సంవత్సరంలో కల్పించే చట్టబద్ధమైన ఉపాధి దినాలను 100 నుంచి 125 రోజులకు పెంచారు. దీనివల్ల గ్రామీణ కుటుంబాలకు అదనపు ఆదాయ భద్రత లభించడంతో పాటు గ్రామీణాభివృద్ధి వేగం పుంజుకుంటుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పథకం అమలు కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం రూ.95,692 కోట్ల భారీ కేటాయింపులు చేసింది. వేతన చెల్లింపుల్లో పారదర్శకత, జవాబుదారీతనం, నిర్ణీత సమయంలోగా చెల్లింపులు జరిగేలా ఈ చట్టంలో కఠిన నిబంధనలు చేర్చారు. మరీ ముఖ్యంగా.. పని కోరిన వారికి నిర్ణీత సమయంలోగా పని కల్పించలేకపోతే, వారికి నిరుద్యోగ భృతిని అందించే నిబంధనను కూడా ఈ చట్టంలో పొందుపరిచారు. ఇది గ్రామీణ కార్మికులకు మరింత భరోసానిస్తుంది. వేతనాల పంపిణీలో ఎక్కడా జాప్యం జరగకుండా ఉండేందుకు పటిష్టమైన సాంకేతిక వ్యవస్థను కూడా ప్రభుత్వం రూపొందించింది.

ఈ పథకంలో మహిళా కార్మికుల భాగస్వామ్యాన్ని పెంచేందుకు చట్టం ఒక వినూత్న నిబంధనను ప్రవేశపెట్టింది. పని ప్రదేశాల్లో శిశు సంరక్షణ కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించనున్నారు. పని స్థలంలో ఐదు సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉంటే, వారిని చూసుకోవడానికి ఒక మహిళా కార్మికురాలిని ప్రత్యేకంగా నియమిస్తారు. దీనివల్ల మహిళలు ఎటువంటి ఆందోళన లేకుండా తమ పనిని కొనసాగించే అవకాశం కలుగుతుంది.

## హసన్ పర్తి స్టేషన్ హౌజ్ ఆఫీసర్ గా ఏ.మహేందర్



**తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే11**

హనుమకొండ జిల్లా హసనపర్తి పోలీస్ స్టేషన్‌కు నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా ఇన్స్పెక్టర్ ఏ. మహేందర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏ. మహేందర్ మాట్లాడుతూ, ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని తెలిపారు. ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం పెంచే విధంగా సేవలు అందిస్తామని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను నిరభ్యంతరంగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తెలియజేయాలని ఆయన కోరారు.

## స్టేషన్ ఘనపూర్ లో ప్రజావాణి కార్యక్రమం

### 22 దరఖాస్తుల స్వీకరణ

**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే11**



స్టేషన్ ఘనపూర్ లో సోమవారం రోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న పాల్గొన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని శాఖల అధికారులతో కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో మొత్తం 22 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలను శ్రద్ధగా విన్న ఆర్డీఓ, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన డివిజన్ స్థాయి అధికారులు మరియు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కళ్లముందే బూడిదైన మొక్కజొన్న పంట

**ఏం చేయాలో అర్థం కాక కన్నీరుమున్నీరవుతున్న రైతన్న**

**ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్య శరణ్యం అంటున్న రైతు కుటుంబం**




**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

ఆరుగాలం కష్టపడి, అప్పులు తెచ్చి పండించిన పంట, సరిగ్గా ఇంటికి చేరే సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ రూపంలో వచ్చిన ప్రమాదం ఆ రైతు కుటుంబాన్ని చీకట్లోకి నెట్టింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం నర్సింగాపూర్ (రేపాక) గ్రామంలో చోటుచేసుకున్న ఈ అగ్నిప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఘటన వివరాల్లోకి వెళ్తే.. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతు కంజుల రమేష్ తనకున్న రెండు ఎకరాల భూమిలో సుమారు రెండు లక్షల రూపాయల వరకు అప్పు తెచ్చి పెట్టుబడిగా పెట్టి మొక్కజొన్న పంటను సాగు చేశారు. వాతావరణం అనుకూలించి పంట బాగా పండటంతో, పంటను కోసి అమ్మితే అప్పులన్నీ తీరిపోతాయని ఆశపడ్డారు.



కోత సమయానికి ట్రాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో, మొక్కజొన్న కంకులను కూలీల సహాయంతో తెంపించి చేనులోనే కుప్పలుగా పోసి ఉంచారు. అయితే సోమవారం పొలం మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి పంట కుప్పలకు అంటుకున్నాయి. సమీపంలోని రైతులు మంటలను గమనించి రమేష్‌కు సమాచారం అందించే లోపే, ఎండ తీవ్రతకు మంటలు వేగంగా వ్యాపించి రెండు ఎకరాల్లోని పంటను పూర్తిగా దహించివేసాయి. ఈ ప్రమాదంలో సుమారు 100 క్వింటాళ్లకు పైగా మొక్కజొన్న కంకులతో పాటు, పంటకు అమర్చిన ఖరీదైన డ్రిప్పు పైపులు, విద్యుత్ మోటారు కూడా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకుని పొలం వద్దకు పరుగున వచ్చిన రమేష్, కళ్లముందే బూడిద కుప్పగా మారిన తన పంటను చూసి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. “రెండు లక్షల అప్పు తెచ్చి కష్టపడితే,ఇప్పుడు ఆ అప్పులు ఎలా తీర్చాలి? ప్రభుత్వం నన్ను ఆదుకోకపోతే ఉరేసుకోవడం తప్ప మరో మార్గం లేదు” అంటూ ఆయన విలపిస్తున్న తీరు అక్కడి వారిని కలిచివేసింది. నిరుపేద రైతు కంజుల రమేష్‌కు జరిగిన భారీ నష్టాన్ని చూసి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే ఘటనా స్థలాన్ని సందర్శించి పంట నష్టాన్ని అంచనా వేయాలని, మానవీయ కోణంలో స్పందించి రైతుకు ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని,లైన్ల నిర్వహణ సరిగ్గా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.



## అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ కు నెలనెలా వేతనాలు సక్రమంగా అందజేయాలి - సిఐటియు డిమాండ్

**తెలుగు గళం న్యూస్ జనగామ మే11**

అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ కు నెలనెలా వేదనల సక్రమంగా అందజేయాలని పెండింగ్లో ఉన్న ఏప్రిల్ నెల వేతనాలు వెంటనే విడుదల చేయాలని సిఐటియు జనగామ జిల్లా కార్యదర్శి సుంచు విజేందర్ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బైరగోని అంజము లు డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో గర్భిణీ స్త్రీలు బాలింతలు చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిస్తున్న అంగన్వాడీ మరియు ఆయాల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. చేసిన శ్రమకు నెల నెల వేతనాలు కూడా సక్రమంగా అందుకోలేని స్థితిలో అంగన్వాడీ టీచర్లు ఆయాలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐ సి డి ఎస్ ని నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రీ ప్రైమరీ విధానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి భద్రత కల్పించాలని పెండింగ్లో ఉన్న సెంటర్ ల అద్దెలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడి టీచర్లకు కొత్తగా ఇచ్చిన సెల్ ఫోన్స్ పనిచేయడం లేదని వాటిని వెంటనే వెనక్కి తీసుకొని అన్ని యాప్స్ మరియు సౌకర్యాలతో 5జీ నెట్వర్క్ ఫోన్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన 180 చట్టాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర శిశు సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం బిఎల్ఓ డ్యూటీలను రద్దు చేయాలని ఐసిడిఎస్ కు సంబంధం లేని పనులు చేయించరాదని డిమాండ్ చేశారు.కాంగ్రెస్ పార్టీ సైతం ఎన్నికల మేనిఫెస్టోలో అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ కు 18 వేల వేతనం పెంచుతామని పిఎఫ్ సౌకర్యం కల్పిస్తామని వంటి అనేక హామీలు ఇచ్చిందన్నారు. ప్రభుత్వం అధికారాంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాల పూర్తయినప్పటికీ, ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా అదనపు పని భారాలను మోపుతూ అంగన్వాడీ టీచర్లు హెల్పర్స్ ను అనారోగ్యాలకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు పి, బిక్షం, సహాయ కార్యదర్శి ఎర్రబెల్లి సంతోష, జిల్లా కమిటీ సభ్యులు టి సంతోష, జ్యోతి, సుమతి, శోభ, సుజాత, లక్ష్మీ, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



## వరి ధాన్యం మొక్కలు కొనుగోలలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

**● తక్షణం కొనుగోలు వేగవంతం చేసి జిల్లాలోని రైతాంగాన్ని ఆదుకోవాలి**

**● సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకా రెడ్డి**



**తెలుగు గళం న్యూస్ జనగామ మే11**

ఆరుగాలం రైతులు కష్టపడి పండించిన మొక్కజొన్న వరి ధాన్యం పంటల కొనుగోలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని తక్షణం జిల్లాలోని రైతాంగాన్ని ఆదుకోవడం కోసం కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం మొక్కలు కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని లేకుంటే సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రజల్ని సమీకరించి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనుక రెడ్డి ప్రభుత్వాలను హెచ్చరించారు. గత వారం రోజులుగా జిల్లాలోని ఐకెపి కేంద్రాలను మొక్కల కొనుగోలు కేంద్రాలను రైస్ మిల్లులను సిపిఎం ఆధ్వర్యంలో సందర్శించి సమస్యల్ని తెలుసుకోవడం జరిగింది. ఈ సమస్యల పరిష్కారం కోసం సోమవారం రోజు జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తే అధికారులు స్పందించని తీరును నిరసిస్తూ పెద్ద ఎత్తున సిపిఎం ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ 11 గంటల నుండి రెండున్నర గంటల వరకు ఎర్రటి ఎండలో ధర్నా నిర్వహించడం జరిగింది. అధికారులు స్పందించకపోవడంతో సిపిఎం నాయకులు, కార్యకర్తలు కలెక్టర్ కార్యాలయంలోనికి వెళ్లడం కోసం ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. స్వల్ప ఉధృత చోటుచేసుకుంది. జనగామ పోలీస్ సిఐ సత్యనారాయణ రెడ్డి చోరవతో జిల్లా సివిల్ సప్లై డియం హతి రామ్ నాయక్ డిఎస్ఓ డిటివోలు ధర్నా వద్దకు వచ్చి ధాన్యం కొనుగోలు జరుగుతున్న జాపియాన్ని సరి చేస్తామని ట్రాన్స్పోర్ట్ ఎగుమతి దిగుమతులను వేగవంతం చేస్తామని రైతుల కొన్న ధాన్యానికి తొందరగా పడే విధంగా చర్యలు చేపడతామని సమస్యలు పరిష్కరిస్తామని వారం రోజులలో ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఈసందర్భంగా ధర్నాను ఉద్దేశించి సిపిఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ గత నెల రోజులుగా ఐకెపి కల్లాలలో వరి ధాన్యం మొక్కలు కొనుగోలు కేంద్రాలలో రైతులు పని పాటలు వదిలేసి వ్యవసాయం బాయిని వదిలేసి కొనుగోలు కేంద్రాల చుట్టూ పడిగాపుల కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే రైస్ మిల్లర్స్ తరుగు పేరుతో బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు కొన్ని ప్రాంతాలలో వడ్లను తీసుకుంటున్నారని రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కాంటా అయిన ఒడ్లు లారీలు అందక ట్రాన్స్పోర్ట్ కాకపోవడం వల్ల రోజుల తరబడి కల్లాలలోనే వడ్లు బస్తాలు చెదలు పడుతున్నాయని ఇది అధికారుల నిర్లక్ష్యం కాదా అని ప్రశ్నించారు. జిల్లాలోని రైస్ మిల్లర్లు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరించాలని అన్నారు. పేరుకే జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా వద్ద కొనుగోలు అలసత్వం జరిగితే సహించనని ప్రకటన చేస్తున్నాడు తప్ప ఆచరణలో ఇప్పటివరకు జిల్లాలో ఇప్పటికీ 40 శాతం దాన్యం సేకరణ కూడా చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా అన్నీ తానై నడిపించడం కాకుండా సంబంధిత డిపార్ట్మెంట్ల అధికారులతో అధికారులను సమన్వయం చేసుకొని టీంవర్క్ చేయించి రైతులు పండించిన పంటలను వర్షాకాలం ముంచుకొస్తున్నందున తక్షణం కొనుగోలు జరిగే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈకార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి సోమయ్య సింగారపు రమేష్ సాంబరాజు యాదగిరి ఇర్రి అహల్య బొట్ల శేఖర్ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి జోగు ప్రకాష్ సంచు విజేందర్ బోడ నరేందర్ పొత్కనూరి ఉపేందర్ మునిగల రమేష్ చిట్యాల సోమన్న గంగాపురం మహేందర్ ఎండి అజారుద్దీన్ గుండెబోయిన రాజు మండల కార్యదర్శిలు మాచర్ల సారయ్య బొడ్డు కరుణాకర్ నాయకులు రమావత్ మీట్య నాయక్ గండి అంజయ్య తూటి దేవదానం కుర్ర ఉప్పలయ్య భల్నే వెంకట మల్లయ్య అన్నబోయిన రాజు పల్లెర్ల లలిత మంగ బీరయ్య అజ్మీర సురేష్ నాయక్ గోసంగి శంకరయ్య ఎండి హతియా మోకు భవాని సోమ సత్యం పోలాసు పరమేష్ కాసాని పుల్లయ్య అపరాధపు రాజు పాముకుంట్ల రేణుక గాడి శివ చిలుముల భాస్కర్ మబ్బు ఉప్పలయ్య పయ్యావుల బిక్షపతి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.





ధర్నా తోపులాటలో సిపిఎం మండల కార్యదర్శి బోడ నరేందర్ కు స్వల్ప గాయాలు

## ప్రభుత్వ హామీల అమలుకై పంచాయతీ కార్మికుల సమరం ప్రారంభానికి సిద్ధం

**తెలుగు గళం న్యూస్ జనగామ, మే 11**

తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సమావేశం జనగామ జిల్లా కేంద్రంలోని విజయ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు పైళ్ల గణపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కామ్రేడ్ పాలడుగు భాస్కర్ హాజరై జెండా ఆవిష్కరణ చేశారు.సమావేశం ప్రారంభంలో అమరవీరులకు సంతాపం ప్రకటించారు.ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు సుధాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చాగంటి వెంకటయ్య, కోశాధికారి తునికి మహేష్, సిఐటియు జనగామ జిల్లా కార్యదర్శి విజయేందర్, రాష్ట్ర మహిళా కన్వీనర్ పొట్ట యాదమ్మ, ఉపాధ్యక్షులు వెంకటేష్ గౌడ్, లక్ష్మీనారాయణ, అంజయ్య, దశరథ్, గ్యార పాండు, బండ్ల అప్పిరెడ్డి, పులి మల్లేష్, కార్యదర్శులు రాపర్తి రాజు, బొజ్జ ఆశన్న, కొప్పుల శంకర్, ఎండి. అసిఫ్, శ్రీకాంత్, రాము, శేఖర్ తదితరులతో పాటు రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.సమావేశంలో పంచాయతీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నేతలు విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం కల్పించాలని, ఉద్యోగాలను శాశ్వతీకరించాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



భవిష్యత్ కార్యాచరణ: మే 20 నుండి 29 వరకు మండల, జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించడం, మే 30న సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గ్రామాల్లో జెండా ఆవిష్కరణతో పాటు గ్రామపంచాయతీ కమిటీలు ఏర్పాటు చేయడం, జూన్ 1న ఎంపీడీవో కార్యాలయాల వద్ద ధర్నాలు, జూన్ 8న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి, జూన్ 15న మంత్రులు, ఎమ్మెల్యేల కార్యాలయాల ముట్టడి, జూన్ 18న అన్ని కార్మిక సంఘాల సమావేశం, జూన్ 20న నల్గొండలో రాష్ట్ర కమిటీ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణ ప్రకటించనున్నారు. పంచాయతీ కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తామని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు.





# పీఎం శ్రీ కూనూరు ఉన్నత పాఠశాలలో

## వేసవి క్రీడల శిక్షణ శిబిరం ప్రారంభం

తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ మే11



జఫర్గఢ్ మండలం కూనూరు గ్రామంలోని పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో సోమవారం (మే 11, 2026) ఉదయం 8 గంటలకు వేసవి క్రీడల శిక్షణ శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శ్రీమతి కాటం దేవేంద్ర మల్లారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వేసవి సెలవులను వృథా చేయకుండా విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో క్రీడల్లో పాల్గొని పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ పర్వాజ్ మాట్లాడుతూ, జనగామ





జిల్లాలో 13 పీఎం శ్రీ పాఠశాలలు ఉండగా, జఫర్గఢ్ మండలంలో కూనూరు పాఠశాల ఒక్కటే ఉందని తెలిపారు. విద్యార్థులకు వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షూటింగ్ బాల్, కబడ్డీ, క్యారమ్స్, చెస్‌తో పాటు కంప్యూటర్ బేసిక్స్, చిత్రలేఖనం, సంగీతం, నృత్యం, ఫోక్ సాంగ్స్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి విభిన్న అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. క్రీడాకారులకు ప్రతిరోజూ అల్పాహారం కూడా అందజేస్తున్నట్లు వివరించారు. శిక్షణ కోసం చందా సాంబరాజు, విజయ్ కుమార్, ముచ్చ సుధాకర్ రెడ్డి, నరేష్‌లను ఇన్‌స్ట్రక్టర్లుగా నియమించగా, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ఆకుల సాయికుమార్ పర్యవేక్షణ చేస్తున్నారు. ఈ సందర్భంగా 24 న్యూస్ రిపోర్టర్ మహమ్మద్ జావిద్ క్రీడాకారులకు రూ.3000 విలువైన వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్ బంతులను అందజేశారు. దీనికి ప్రధానోపాధ్యాయులు పర్వాజ్, పీఈటీ సాయికుమార్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాజీ పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎల్లాచారి, గ్రామ క్రీడాకారుడు చేగొండ రమేష్, స్వచ్ఛంద కార్యకర్త పల్లె రాజిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శిబిరం మొదటి రోజున 30 మంది క్రీడా విద్యార్థులు హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు తెలిపారు.







# పర్వతగిరి మోడల్ స్కూల్‌లో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

## విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్న తహశీల్దార్

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 11




వరంగల్ జిల్లా పర్వతగిరి వేసవి సెలవులను విద్యార్థులు వృథా చేసుకోకుండా నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని పర్వతగిరి మండల తహశీల్దార్ టి. వెంకటస్వామి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో సమ్మర్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహశీల్దార్ వెంకటస్వామి మాట్లాడుతూ, “వేసవిలో ఇళ్ల వద్ద సమయాన్ని వృథా చేసుకోకుండా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ సమ్మర్ క్యాంపు దోహదపడుతుంది” అని అన్నారు.

**క్యాంప్ వివరాలు:**

ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి ఏ. బిక్షపతి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పి. శ్రీదేవి మాట్లాడుతూ క్యాంప్ వివరాలను వెల్లడించారు.

**అంశం వివరాలు**

నిర్వహణ తేదీలు మే 11 నుండి మే 25 వరకు

సమయం: ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 12:00 గంటల వరకు

వేదిక మోడల్ స్కూల్, పర్వతగిరి

అర్హత 6 నుండి 9వ తరగతి చదివే విద్యార్థులు. ఏ పాఠశాల విద్యార్థులైనా చేరవచ్చు

నేర్పించే అంశాలు మ్యూజిక్, డాన్స్, డ్రాయింగ్, స్టోరీ టెల్లింగ్, చెస్, ఇండోర్ గేమ్స్, ఇతర నైపుణ్యాలు

ప్రత్యేక సౌకర్యం హాజరయ్యే విద్యార్థులకు అల్పాహారం అందజేత

ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు భవానీ, రాజప్రభు, రిసోర్స్ పర్సన్స్ హైమవతి, శ్రీలేఖ, మాధవి, సీఆర్‌పీ ప్రవీణ్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

“ఒక్కొక్కసారి వినపడ్డదే కాదు కనపడేది కూడా నిజం కాకపోవచ్చు”

“కంటికి కనిపించిన దృశ్యం అంతా నిజం కాదు...
నిజం చాలా సార్లు మన అర్థం దాటి ఉంటుంది.”

“చూసిన కోణం మారితే కథ కూడా మారుతుంది...
అందుకే తీర్పు ముందు ఆలోచన అవసరం.”

“అపార్థం కళ్లలో పుడుతుంది...
నిజం మాత్రం హృదయంలో దాగి ఉంటుంది.”

“బయట కనిపించేది ఒక కథ...
లోపల జరిగేది మరో సత్యం.”

“దూరం నుంచి చూసిన దృశ్యం మోసం చేయవచ్చు...
సమీపం నుంచి అర్థం చేసుకున్నదే నిజం.”

“జీవితం మనకు కనిపించినట్లే ఉండదు...
మనకు అర్థమైనట్లే నిజం కాదు.”

“తప్పు తీర్పు ఇవ్వడం సులువు...
సత్యం తెలుసుకోవడం ఓ సహనం.’

**-- రవిబాబు పిట్టల.**

పిసి: రఘు ఘనపురం.
లొకేషన్: అమీన్ పూర్ లేక్, హైదరాబాద్.



# నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం మోపాలి

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

- అక్రమ విక్రయాలు జరిపితే డీలర్ల లైసెన్సులు రద్దు
- ఫార్మర్ రిజిస్ట్రీలో వెనుకబడొద్దు-వ్యవసాయ అధికారులకు ఆదేశం

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి



జిల్లాలో నకిలీ విత్తనాల విక్రయాలను కట్టడి చేయడానికి కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమాలకు పాల్పడే వారిపై పోలీస్ కేసులు నమోదు చేయడంతో పాటు లైసెన్సులు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో నకిలీ విత్తనాల నియంత్రణ, ఫార్మర్ రిజిస్ట్రీ, పచ్చి రొట్ట ఎరువుల వినియోగం, నానో యూరియాపై అవగాహన అంశాలపై వ్యవసాయ, పోలీస్ శాఖల అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వానాకాలం సాగు సమయానికి రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు మండల స్థాయిలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖలతో, జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ బృందాలతో నిరంతర నిఘా ఉంచాలన్నారు. విత్తనాల అక్రమ నిల్వలు, రవాణాపై రాజీ లేని పోరాటం చేయాలని సూచించారు. రైతులకు మేలు చేసే పచ్చి రొట్ట ఎరువుల సాగు, నానో యూరియా వాడకంపై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ ఇప్పటి వరకు 67 శాతంలిపూర్తయిందని, దీనిని వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కొత్తపల్లి గోరి క్లస్టర్‌లో అత్యధికంగా 82 శాతం నమోదు పూర్తి చేసిన ఏఓ సారయ్యను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిరోజూ పురోగతి నివేదికలను సమర్పించాలని, రైతులకు ప్రభుత్వ పథకాలు అందాలంటే ఈ రిజిస్ట్రీ కీలకమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, ఏఎస్పీ నరేష్ కుమార్, ఏడీఏ శ్రీపాల్, అన్ని మండలాల వ్యవసాయ అధికారులు, ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవం

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మే 11: పిట్లం మండలంలోని హరిజనవాడలో నేడు ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి చంద్రశేఖర్, ఉప సర్పంచ్ మీర్జా అవేజ్ బేగ్, జీపీ కార్యదర్శి బలరాం పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మండల పార్టీ అధ్యక్షుడు మెగావత్ రవీందర్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు ఇమ్రోజ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాలరాజ్, బాలు తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల ద్వారా పేదలకు గృహ వసతి కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజా చేసే ప్రభుత్వ ధ్యేయమని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

## జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి



జిల్లాలో ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఎలాంటి అక్రమాలకు తావులేకుండా, అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, విద్యా, వైద్య తదితర శాఖల అధికారులతో పరీక్షల నిర్వహణపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ నెల 13వ తేదీ నుండి 21వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయని తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి అరగంట ముందే, అంటే ఉదయం బ్యాచ్ వారు 8:30 గంటలకు, మధ్యాహ్నం బ్యాచ్ వారు 2 గంటలకు కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను విద్యార్థులతో పాటు సిబ్బందికి కూడా అనుమతించబోమని, నిశిత తనిఖీల తర్వాతే లోపలికి పంపిస్తారని స్పష్టం చేశారు. విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు నడపాలని, ప్రతి కేంద్రంలో తాగునీరు, ప్రథమ చికిత్స మందులతో కూడిన వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లు మూసివేయాలని పోలీసు శాఖను ఆదేశించారు. జిల్లాలోని భూపాలపల్లి, కాటారం, మహాదేవపూర్, చిట్యాల మండలాల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, మొదటి సంవత్సరం 913 మంది, రెండో సంవత్సరం 306 మంది విద్యార్థులు హాజరవుతున్నారని కలెక్టర్ వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, ఏఎస్పీ నరేష్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, ఇంటర్మీడియట్ అధికారి వెంకన్న, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

- ఐడీఓసీలో ప్రజల నుండి 65 వినతుల స్వీకరణ
- పారదర్శకత కోసం ప్రతి దరఖాస్తును పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశం





తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతగా తీసుకుని, నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన పాల్గొని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ఈ రోజు జరిగిన కార్యక్రమంలో మొత్తం 65 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు సమయపాలనతో సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అందిన ప్రతి విన్నపాన్ని అధికారులు వ్యక్తిగతంగా పరిశీలించి, వెంటనే సంబంధిత శాఖలకు ఎండార్స్‌మెంట్ చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో పారదర్శకత ఉండాలని, ఇందుకోసం ప్రతి దరఖాస్తును తప్పనిసరిగా ప్రజావాణి పోర్టల్‌లో నమోదు చేసి, దరఖాస్తుదారునికి రశీదు అందజేయాలని స్పష్టం చేశారు. వినతులపై అధికారులు తీసుకున్న చర్యల వివరాలను కూడా క్రమం తప్పకుండా పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినా లేదా అనవసరంగా జాప్యం చేసినా సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డీఆర్వో వసంత కుమారి, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మరిపెడ మండలంలో ఆర్టీసీ డ్రైవర్‌కు రోడ్డు ప్రమాదం

తెలుగు గళం న్యూస్ మహబూబాబాద్ జిల్లా



మహబూబాబాద్ డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ భూక్య శ్రీను (39) శనివారం విధులకు హాజరుకావడానికి ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్‌కు వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. మరిపెడ మండలంలోని గాలివారిగూడెం--దరవత్ తండా మధ్య రోడ్డుపై ఆవును ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి.


ఈ ప్రమాదంలో శ్రీను కుడి చెవి నుంచి రక్తస్రావం కావడంతో స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. మరిపెడ 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి (జీజీహెచ్) తరలించారు. ఈ సేవల్లో ఈఎంటీ అనుముల రామన్న , పైలట్ బాల మధు పాల్గొన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**



రాష్ట్రంలో మొక్కజొన్న కొనుగోలు, నిల్వ, రవాణా ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ కార్యదర్శి కె.సురేంద్ర మోహన్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుండి ఆయన వివిధ జిల్లాల అధికారులతో మొక్కజొన్న సేకరణపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ నుండి అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాల వద్ద హమాలీ చార్జీల పెంపు, గన్నీ బ్యాగుల లభ్యత, తగినంత స్టోరేజ్ స్పేస్, సకాలంలో రవాణా సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా రైతులు తమ సొంత గన్నీ బ్యాగులను తీసుకువచ్చిన సందర్భంలో వాటిని నిబంధనల ప్రకారం ఎంట్రీ చేసే విధానంపై స్పష్టతనిచ్చారు. క్షేత్రస్థాయిలో మొక్కజొన్న కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలని,



రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో మొక్కజొన్న సేకరణకు సంబంధించి తీసుకుంటున్న చర్యలను కార్యదర్శికి వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, జిల్లా సహకార అధికారి వాలియా నాయక్, మార్క్‌ఫెడ్ నోడల్ అధికారులు, మార్కెటింగ్ శాఖకు చెందిన ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

- **యంత్రాల భద్రతపై ఆకస్మిక తనిఖీ**
- **నిబంధనల ప్రకారం భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశం**







**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

జిల్లా కేంద్రంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) గోదామును జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోదాంలో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీపాట్ యంత్రాల రక్షణ ఏర్పాట్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత, నిష్పాక్షికతను కాపాడటంలో ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. గోదాం వద్ద అమలు చేస్తున్న డబుల్ లాక్ సిస్టమ్, సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణ, అగ్నిమాపక పరికరాల లభ్యతను ఆయన తనిఖీ చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం యంత్రాల నిర్వహణ రికార్డులు, స్ట్రాంగ్ రూమ్ రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గోదాం ప్రాంగణమంతా కలియదిరిగిన కలెక్టర్, భద్రతా సిబ్బందికి పలు సూచనలు చేశారు. యంత్రాలు సక్రమంగా భద్రపరచబడి ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని స్పష్టం చేశారు. తనిఖీ అనంతరం సంబంధిత రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు అబ్బాస్, నవీన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సమ్మయ్య దశదిన కర్మలో మార్నేని రవీందర్ రావు నివాళి

**తెలుగు గళం న్యూస్ ఐనవోలు/మే 11**

హన్మకొండ జిల్లా:ఐనవోలు మండల కేంద్రంలో నందనం సొసైటీ డైరెక్టర్ కీ.శే. పల్లకొండ సమ్మయ్య దశదిన కర్మ కార్యక్రమంలో మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు పాల్గొని నివాళులర్పించారు.

సమ్మయ్య నివాసానికి చేరుకున్న రవీందర్ రావు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



అనారోగ్యంతో మృతి చెందిన కీ.శే.శాగంటి వెంకటయ్య పార్థివదేహానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు వెంట నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్ రావు, మాజీ ఐనవోలు దేవస్థానం చైర్మన్ మునిగాల సమ్మయ్య, మండల సర్పంచులు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటర్ల మ్యాపింగ్‌ను వేగవంతం చేయాలి
## రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**




భారత ఎన్నికల సంఘం త్వరలో చేపట్టనున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ ఐ ఆర్) కార్యక్రమం నేపథ్యంలో ఓటర్ల మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఈఓ కార్యాలయం నుండి రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు (డిఈఓలు), రిటర్నింగ్ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో భూపాలపల్లి ఐడీఓసీ నుండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, రిటర్నింగ్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ, ఓటర్ల మ్యాపింగ్‌లో ఈ నెలాఖరు నాటికి కనీసం 90 శాతం పురోగతి సాధించాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో రెసిడెన్షియల్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీలు, స్వయం సహాయక సంఘాలు, ఉద్యోగ సంఘాలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉద్యోగులు స్వచ్ఛందంగా తమ పరిధిలోని బూత్ లెవల్ ఆఫీసర్లను (బి ఎల్ ఓ లు) సంప్రదించి వివరాలను మ్యాపింగ్ చేయించుకోవాలని, ఇందుకు సంబంధించిన




బీఎల్ఓల వివరాలు సీఈఓ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరణించిన, వలస వెళ్లిన లేదా చిరునామా మారిన ఓటర్ల వివరాలపై ప్రత్యేక దృష్టి పెట్టి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, అలాగే వివిఐపి,విఐపి ఓటర్ల మ్యాపింగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటర్ల సహాయార్థం జిల్లా నియోజకవర్గ స్థాయిల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని, ప్రతి బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమై మ్యాపింగ్ పురోగతిని సమీక్షించాలని సూచించారు. బీఎల్ఓలు తమ ఓటీపీలు లేదా కీలక సమాచారాన్ని అనధికార వ్యక్తులతో పంచుకోవద్దని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పుగా జరిగిన మ్యాపింగ్‌లను తక్షణమే సరిదిద్దాలని, మీడియా ద్వారా ఈ కార్యక్రమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్లను కోరారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు సీఈఓ డా.వాసం వెంకటేశ్వర్ రెడ్డి,నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గుప్త నిధుల కోసమే అర్ధరాత్రి కాకతీయుల నాటి చారిత్ర కలిగిన శివాలయం కూల్చివేత

- **బడి పేరుతో గుడిని కూల్చిన రేవంత్ రెడ్డి లంక బిందెల వేటలో 24 అడుగుల తవ్వకాలు**
- **ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల టెండర్లలో 500 కోట్ల భారీ కుంభకోణం అన్నీ ఎక్సెస్ టెండర్లే**
- **అశోక్ నగర్‌లో ధ్వంసమైన మట్టికోట శివాలయాన్ని పరిశీలించిన మాజీ మంత్రి హరీశ్ రావు**



**తెలుగు గళం న్యూస్ నర్సంపేట / అశోక్ నగర్ ( మే 11 )**

వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండలం అశోక్ నగర్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ధ్వంసం చేసిన 800 ఏళ్ల చరిత్ర గల కాకతీయుల నాటి మట్టికోట శివాలయాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు సందర్శించారు. కూల్చివేతకు గురైన ఆలయ ప్రాంగణంలో స్థానికులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పర్యటనలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్ నాయక్, వినయ్ భాస్కర్, ఆరూరి రమేష్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. శివాలయ సందర్శన అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు.

మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ



రేవంత్ రెడ్డి పాలనలో బడులు ఆగమే కాదు ఏకంగా గుడుల విధ్వంసం కూడా జరుగుతోంది. ఆనాడు కేసీఆర్ మన ఊరు-మన బడి పెడితే రేవంత్ రెడ్డి దాన్ని అర్ధాంతరంగా నిలిపేశారు. రేవంత్ రెడ్డి పుణ్యమా అని ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య తగ్గిపోతోంది. దేవుళ్ల మీద ఒట్లు పెట్టి వంద శాతం రుణమాఫీ చేయకుండా మాట తప్పిన భారతదేశ తొలి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఆయనకు దేవుడంటే భయం లేదు, భక్తీ లేదు. కేసీఆర్ యాదాద్రి లాంటి మహా పుణ్యక్షేత్రాలను నిర్మిస్తే, రేవంత్ రెడ్డి మాత్రం హైడ్రా పేరుతో పేదల ఇండ్లు, మసీదులు, చర్చీలు, ఇప్పుడు ఏకంగా గుడులు కూలగొడుతున్నాడు.

విశాఖ పీఠం కూలుస్తా అని మొన్న అధికారులను పంపాడు. సీఎం అయిన కొత్తలో సెక్రటేరియట్ కు పోతే లంక బిందెలు దొరుకుతాయనుకున్నా అని రేవంత్ రెడ్డి అన్నాడు. ఆయన అనుయాయులతో కలిసి నిజాం భవనాల చుట్టూ గుప్త నిధుల కోసం బాగానే వెతికాడు. అక్కడ దొరకకపోయే సరికి ఇప్పుడు కాకతీయుల గుడుల మీద పడ్డాడు. అశోక్ నగర్ లో కాకతీయ గణపతి దేవుడు నిర్మించిన 800 ఏళ్ల నాటి అద్భుతమైన శివాలయాన్ని ఉద్దేశపూర్వకంగా కూల్చేశారు. ఆలయ రక్షణ కోసం ఉన్న అతిపెద్ద మట్టి ఆనకట్టను తొలుచుకుంటూ వెళ్లి మరీ గర్భగుడిని ధ్వంసం చేశారు. రాత్రి 12 నుంచి 1 గంట మధ్య, చీకట్లో గర్భగుడి కింద ఏకంగా 24 అడుగుల లోతు భారీ గుంత తవ్వారు. స్కూల్ కట్టే పనైతే పగలు చేయొచ్చు కదా? అర్ధరాత్రి ఎందుకు తవ్వారు? గుప్త నిధుల వేటలో రేవంత్ రెడ్డి డైరెక్షన్ లోనే ఈ కుట్ర జరిగింది. ఇది గుప్త నిధుల కోసం జరిగిన తవ్వకమే అని పురావస్తు శాఖ జిల్లా అధికారి బుజ్జి ఈ నెల 7వ తేదీన కలెక్టర్ కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆర్కియాలజీ అధికారి కంప్లైంట్ ఇచ్చినా ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ కాలేదు, మిషనరీ సీజ్ చేయలేదు, ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. అంటే దీని వెనుక రాష్ట్ర ప్రభుత్వ పెద్దల హస్తం ఉందన్నది స్పష్టం. బీఆర్ఎస్ హయాంలో ధరణిలో ఇది దేవాలయ భూమి గా ఉంటే కాంగ్రెస్ రాగానే భూభారతిలో రాత్రికి రాత్రే ప్రభుత్వ భూమిగా ఎట్లా మారింది. స్కూల్ కట్టడానికి చుట్టూ కావలసినంత స్థలం ఉంది. అసలు ఈ నియోజకవర్గంలో వేరే చోట జీవో వచ్చిన స్కూల్ ను ఇక్కడికి ఎందుకు మార్చారు. గుడి ఉన్నకాడ బడి కట్టొచ్చు, కానీ పోయిపోయి గుడినే కూలగొట్టడం ఎందుకు. పురావస్తు శాఖ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, బాధ్యులను అరెస్ట్ చేసి మిషనరీని సీజ్ చేయాలి. యుద్ధప్రాతిపదికన ఈ చారిత్రక శివాలయాన్ని పునరుద్ధరించాలి.

1958 చట్టం ప్రకారం వందేళ్లు దాటిన కట్టడాలు ఆర్కియాలజీ పరిధిలోకి వస్తాయి కాబట్టి, ఈ స్థలాన్ని తక్షణమే పురావస్తు శాఖకు అప్పగించాలి. అర్ధరాత్రి తవ్వకాల్లో బయటపడ్డ గుప్త నిధులు, లంక బిందెలు ఏ ప్రభుత్వ పెద్దల ఇళ్లకు పోయాయో సమగ్ర విచారణ జరగాలి. సీవీసీకి, విజిలెన్స్ కు సైతం ఫిర్యాదు చేస్తాం.

విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి స్కూళ్ల టెండర్లలో భారీ కుంభకోణానికి పాల్పడ్డారు. రాష్ట్రంలో 76 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు టెండర్లు పిలిస్తే.. అన్నీ 4.86%, 4.96%, 4.99% ఎక్సెస్ కే ఇచ్చారు. ఒక్క టెండర్ కూడా మైనస్ కు పోకుండా అన్నీ ఎక్సెస్ కే ఎట్లా పోయాయి.

ఈ స్కూళ్ల టెండర్లలో ఏకంగా 494 కోట్ల ఒక లక్ష రూపాయల ఎక్సెస్ అమౌంట్ ద్వారా ప్రజాధనం లూటీ అయ్యింది. నర్సంపేట ప్యాకేజ్-8 కింద 136 కోట్లకు టెండర్ ఉంటే అది 142 కోట్లకు (4.86% ఎక్సెస్) ఇచ్చారు.

తమకు అనుకూలంగా ఉండేందుకు ఒక రిటైర్డ్ అధికారిని చీఫ్ ఇంజనీర్ గా పెట్టుకుని ఈ 500 కోట్ల దోపిడీకి తెరతీశారు. కాంట్రాక్టర్లు నా మనుషులైతే టెండర్లు రద్దు చేయి. టెండర్లు దక్కించుకున్న వాళ్లు హరీశ్ రావు మనుషులే అని రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నాడు. వాళ్లు నా మనుషులే అయితే వెంటనే ఆ టెండర్లను రద్దు చేయి నేనే కదా రద్దు చేయమని డిమాండ్ చేస్తున్నది. మొన్న హెచ్ ఏ ఎం రోడ్ల పేరుతో ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్ శాఖల్లో 25% ఎక్సెస్ తో జరిగిన 5000 కోట్ల కుంభకోణాన్ని అసెంబ్లీలో బయటపెట్టి పోరాడింది నేనే. అవి నీ మనుషులా? నా మనుషులా? అన్నది కాదు. అది రాష్ట్ర ప్రజల చెమట చుక్కల ఆదాయం. బీఆర్ఎస్ హయాంలో ఎన్నడూ 5% కి మించి ఎక్సెస్ టెండర్లు ఇవ్వలేదు. మొబిలైజేషన్ అడ్వాన్స్ రద్దు చేసి, వెంటనే ఈ ప్రజాధనం లూటీని ఆపాలి.

# భూపాలపల్లి డీఆర్వో వసంత కుమారికి 'ట్రెస్సా' ఘన స్వాగతం

## •మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ప్రతినిధి బృందం
## •పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షల వెల్లువ



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా నూతన రెవెన్యూ అధికారి (డీఆర్వో) గా బాధ్యతలు చేపట్టిన శ్రీమతి వసంత కుమారి ని సోమవారం తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెస్సా) జిల్లా శాఖ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టరేట్ లోని ఆమె కార్యాలయంలో ట్రెస్సా జిల్లా అధ్యక్షులు శ్రీ మార్క రామ్మోహన్ ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నూతన డీఆర్వోకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం జిల్లా అధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ.. జిల్లాలో రెవెన్యూ యంత్రాంగం బలోపేతానికి, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో నూతన డీఆర్వో మార్గనిర్దేశనంలో ఉద్యోగులందరూ సమన్వయంతో పని చేస్తామని తెలిపారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని వారు కోరారు. తమను కలవడానికి వచ్చిన ట్రెస్సా ప్రతినిధులకు డీఆర్వో వసంత కుమారి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పరిపాలనలో రెవెన్యూ విభాగం అత్యంత కీలకమని, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెస్సా జిల్లా ప్రధాన కార్యదర్శి మహ్మద్ రజాక్, ట్రెజరర్ పకిడే రాజయ్య, అసోసియేషన్ ఇతర ముఖ్య నాయకులు, రెవెన్యూ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కులగణన, బీసీ రిజర్వేషన్లపై నోరు మెదపని ప్రధాని

## -బీసీల ఎడల మోడీ నిజస్వరూపం బయటపడింది -బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు విమర్శ

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి,(మే 11):** హైదరాబాద్ పర్యటనకు వచ్చిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన గణనలో కులగణన, బీసీ రిజర్వేషన్ల అంశాలపై నోరు మెదపకపోవడం బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వ నిజస్వరూపాన్ని బయటపెట్టిందని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు తీవ్రంగా విమర్శించారు. ఒక ప్రకటన విడుదల చేసిన ఆయన,"పరేడ్ గ్రౌండ్‌లో 40 నిమిషాలు ప్రసంగించిన ప్రధాని దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల ఊసే ఎత్తకపోవడం గమనార్హం. దేశ జనగణనలో కులాల గణన, చట్టసభలలో బీసీలకు 50% రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్ కోటా, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు, జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు, తెలంగాణలో విద్యా ఉద్యోగ రంగాలతో పాటు స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్ బిల్లు ఆమోదం వంటి న్యాయమైన డిమాండ్లపై ప్రధాని స్పందించకపోవడం విడ్డూరం" అని మండిపడ్డారు. వంచనలో మోడీని మించిన వారే లేరు

"బీసీలకు చేసిన వాగ్దానాలను అమలు జరపకుండా వంచించడంలో మోడీని మించిన వారు లేరు. ప్రజలంతా పొదుపు పాటించాలని, ప్రయాణాలు తగ్గించుకోవాలని ఉచిత సలహాలు ఇచ్చే ప్రధాని, తాను మాత్రం గతంలో ఏ ప్రధాని చేయనంతగా విదేశీ ప్రయాణాలు చేస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సబబేనా?" అని వెంకట్రాములు ప్రశ్నించారు.

ఐక్య పోరాటాలకు పిలుపు

బీసీలకు అన్యాయం చేస్తున్న మోడీ పర్యటనను నిరసిస్తూ హైదరాబాద్ అసెంబ్లీ ఎదురుగా అమరవీరుల స్తూపం వద్ద, రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్న బీసీ శ్రేణులకు ఆయన అభినందనలు తెలిపారు. రాజ్యాధికారంలో న్యాయమైన వాటాతో పాటు ఇతర డిమాండ్ల సాధన కోసం రానున్న కాలంలో



రాజకీయాలకు అతీతంగా అన్ని బీసీ సంఘాలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

# పది, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన గిరిజన బాలికలకు
# మంత్రి కొండా సురేఖ సత్కారం

**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే11**



వరంగల్ జిల్లా పర్వతగిరి, పదవ తరగతి, ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులతో సత్తా చాటిన ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల విద్యార్థినులను పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సత్కరించారు. పర్వతగిరి మండలం జమాల్పురం గ్రామంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల పాఠశాల/కళాశాలకు చెందిన విద్యార్థిని భూక్య నవ్య పదవ తరగతిలో 600 మార్కులకు 569 మార్కులు సాధించి పర్వతగిరి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే కళాశాలకు చెందిన విద్యార్థిని జి. త్రిష ఇంటర్మీడియట్ సెకండియర్‌లో 1000 మార్కులకు 986 మార్కులు సాధించి ప్రతిభ కనబరిచింది. వరంగల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగిన యంగ్ అచీవర్స్ సన్మాన కార్యక్రమం'లో భాగంగా మంత్రి కొండా సురేఖ, వరంగల్ ఎంపీ కడియం కావ్య, కుడా చైర్మన్ వెంకట రామ్ రెడ్డి, వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద చేతుల మీదుగా ఈ ఇద్దరు విద్యార్థినులను శాలువాతో సత్కరించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శైలజారాణి మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా మా పాఠశాలకు మంచి గుర్తింపు తెచ్చిన విద్యార్థినులకు పాఠశాల పక్షాన అభినందనలు. వీరి విజయం ఇతర గిరిజన బాలికలకు స్ఫూర్తిదాయకం అని హర్షం వ్యక్తం చేశారు.





# ఐనవోలులో బీఆర్ఎస్ నేతల కుటుంబాలను
# పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు




**తెలుగు గళం న్యూస్ ఐనవోలు/మే11**

హన్మకొండ జిల్లా: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ గడ్డం శ్రీనివాస్ కుటుంబంతో పాటు పలువురు బీఆర్ఎస్ సీనియర్ నాయకుల కుటుంబాలను మాజీ మంత్రివర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. కీ.శే. గడ్డం భాగ్యమ్మ: ఐనవోలు మండల కేంద్రానికి చెందిన మాజీ సీఎం కేసీఆర్ పీఎస్ఓ గడ్డం శ్రీనివాస్ తల్లి కీ.శే. గడ్డం భాగ్యమ్మ ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వారి నివాసానికి వెళ్లి భాగ్యమ్మ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కీ.శే. పల్లంకొండ సమ్మయ్య: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ సురేష్ తండ్రి పల్లంకొండ సమ్మయ్య ఇటీవల పరమపదించారు. సోమవారం వారి నివాసానికి వెళ్లిన ఎర్రబెల్లి దయాకర్ రావు సమ్మయ్య చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కీ.శే. బొమ్మిరెడ్డి సమ్మి రెడ్డి: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కీ.శే. బొమ్మిరెడ్డి సమ్మి రెడ్డి మొదటి వర్ధంతి సందర్భంగా వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనారోగ్యంతో మరణించిన సీహెచ్. వెంకటయ్య కుటుంబాన్ని కూడా పరామర్శించారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వెంట ఐనవోలు బీఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ వైస్ ఎంపీపీ తంపుల మోహన్, సర్పంచుల ఫోరం అధ్యక్షులు గడ్డం రఘు వంశీ గౌడ్, నందనం సొసైటీ వైస్ చైర్మన్ తక్కళ్లపెల్లి చందర్ రావు, సర్పంచులు అశోక్ రావు, వాణి రవి కుమార్, మాజీ ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్, మాజీ ఐనవోలు దేవస్థానం చైర్మన్ మునిగాల సమ్మయ్య, చింత అశోక్, దుప్పేల్లి రాజు, కొత్తూరు జాన్సన్, చింత రఘు, రాములు తదితరులు పాల్గొన్నారు.



# నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు

## •ఘనంగా కృష్ణవేణి-రాందాస్ వివాహ రిసెప్షన్
## •పాల్గొన్న లంబాడీల ఐక్యవేదిక అధ్యక్షులు పల్లవి రాజు నాయక్, ప్రజాప్రతినిధులు



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

భూపాలపల్లి జిల్లా గొల్ల బుద్ధారం పెద్ద తండాలో లావుడియా ఫుల్ బంద్ సీతారాం నాయక్ కుమారుడు కృష్ణవేణి-రాందాస్ వివాహ రిసెప్షన్ వేడుక అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు లంబాడీల ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పల్లవి రాజు నాయక్, స్థానిక సర్పంచ్ అజ్మీర జైపాల్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొత్త జీవితంలోకి అడుగుపెడుతున్న వధూవరులు అన్యోన్యంగా ఉంటూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో తారాబాయి, దాసు నాయక్, జ్యోతి బాలు నాయక్, శారద రాము నాయక్, విజయ రఘురాం, అరుణ రాజన్న, వసంత చీమన్ నాయక్, మమత గణపతి, రజిత రాజన్న తదితర ప్రముఖులు పాల్గొన్నారు. వధూవరులను ఆశీర్వదించిన వారిలో గోపి నాయక్, ప్రతాప్ నాయక్, మల్లయ్య, కళ్యాణ్, కార్తీక్, పరం సింగ్, రతన్ సింగ్, రంజిత్ నాయక్, నవీన్ నాయక్ సహా పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, బంధుమిత్రులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.



# చట్టం అందరికీ సమానంగా ఉండాలి

## కంటోన్మెంట్ బీఆర్ఎస్ నాయకుల డిమాండ్



రాష్ట్రంలో పేదలకు ఒక న్యాయం, మంత్రుల పిల్లలకు మరో న్యాయం జరుగుతోందని, ఇది తెలంగాణ ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. మైనార్టీలు, మహిళలు, విద్యార్థుల రక్షణపై గతంలో ప్రభుత్వాలు చేసిన ప్రకటనలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని వారు విమర్శించారు. ముఖ్యంగా బీజేపీ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన కేసులో ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోకపోవడంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సామాన్యులపై ఇటువంటి కేసులు ఉంటే తక్షణమే స్పందించే యంత్రాంగం, అధికార పార్టీ నాయకుల విషయంలో ఎందుకు వెనుకడుగు వేస్తోందని వారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా మాజీ చైర్మన్ గజ్జెల నాగేశ్ మాట్లాడుతూ చట్టం ముందు అందరూ సమానమేనని, బాధితురాలైన మైనర్ బాలికకు తక్షణమే న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, తప్పు చేసిన వారు ఎవరైనా సరే వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కోరారు. బాధితురాలి కుటుంబం సమాజంలో తలెత్తుకుని జీవించేలా భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ మీడియా సమావేశంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టి.ఎన్. శ్రీను, సీనియర్ నాయకులు జంగ్లీ రాజు, జంగాల మురళి యాదవ్, రావుల సతీష్, పనస సంతోష్ తదితరులు పాల్గొని ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలే లక్ష్యం

## చిన్న గౌరయపల్లిలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పర్యటన

యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట, రాజపేట మండలాల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత చిన్న గౌరయపల్లి గ్రామంలో మహిళల ఆర్థికాభివృద్ధి, స్వయం ఉపాధిని ప్రోత్సహించే లక్ష్యంతో మహిళా సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం అదే గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించిన ఆయన, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ప్రాధాన్యతని, కొత్త భవనాల ద్వారా ప్రజలకు పాలన మరింత చేరువవుతుందని పేర్కొన్నారు. అనంతరం రాజపేట మండలం రఘునాధపురం గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్రీ మార్కండేయ స్వామి ఆలయాన్ని సందర్శించి పనుల పురోగతిని పరిశీలించిన ఎమ్మెల్యే, ఆధ్యాత్మిక కేంద్రాలు గ్రామ వికాసానికి తోడ్పడతాయని తెలిపారు. పర్యటనలో భాగంగా చల్లూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రతి అర్హ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అమాయకులపై నమోదు చేసిన కేసులు తొలగించండి.. ఎంపీ అవినాష్ రెడ్డి



కడపజిల్లా: ఈ నెల 9న జరిగిన మత ఘర్షణల ఘటన దురదృష్ట కరమని,ఇందులో కొంతమంది అమాయకుల పైన కేసు నమోదు చేశారని, ఈరోజు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఐపీఎస్ గారిని కలిసిన పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి.అంజాద్ భాషా, జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్ రెడ్డి, సిఇసి సభ్యులు కే.సురేష్ బాబు కలిసి ఎస్పీ నచ్చికేత్ తెలుపుతూ.. ఈ నెల 9న జరిగిన ఘటన దురదృష్ట కరం అంటూ దశాబ్దాలుగా కడప నగరంలో మత సామరస్యం కొనసాగుతోందని, ఇకపై కూడా అదే వాతావరణం ఉండాలని కోరారు. మొన్నటి ఘటనలో కొంతమంది అమాయకులపై కేసు నమోదు చేశారని, అందులో నాలుగు రోడ్ల కూడలి కావడం వల్ల అనేకమంది అక్కడ గుమికూడి గుంపులుగా ఉన్నారన్నారు. ఈ క్రమంలోనే

అమాయకులపై కేసులు నమోదు చేశారు అంటూ వీలైనంతవరకు కేసులు లేకుండా చూడాలని ఎస్పీ నచ్చికేత్ ను కోరినట్టు ఎంపీ అవినాష్ రెడ్డి మీడియా సమావేశంలో తెలుపుతూ..

తమ వినతిని ఎస్పీ సానుకూలంగా స్వీకరించారని తెలిపారు. తప్పు చేసిన వారిపై మాత్రమే చర్యలు ఉంటాయని, మిగతా వారిపై ఎటువంటి ఇబ్బందులు ఉండవని ఎస్పీ హామీ ఇచ్చారని వెల్లడించారు.

ఈ ఘటనలో ఇతర శక్తుల ప్రమేయంపై మాట్లాడటం సరికాదని, ఇది సున్నితమైన విషయం కావడంతో అందరూ జాగ్రత్తగా వ్యవహరించాలని కడప నగర ప్రజలను ఉద్దేశించి ఎంపీ అవినాష్ రెడ్డి సూచించారు.

---

## రాపూరులో మానవత్వం చాటుకున్న తెదేపా నేతలు
## నిరుపేద కుటుంబానికి అండగా కోటి నాయుడు



నెల్లూరు జిల్లా రాపూరు: నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని రాపూరు పట్టణంలో ఇటీవల ముత్యం భూమయ్య అనే వ్యక్తి వడదెబ్బకు గురై మృతి చెందడంతో స్థానికంగా అందరినీ కలిచివేసింది. ఈ విషయం తెలుసుకున్న వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ తక్షణమే స్పందించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు టిడిపి రాపూరు పట్టణ అధ్యక్షులుకోటి నాయుడు మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. నిరుపేద స్థితిలో ఉన్న ఆ కుటుంబానికి తన వంతు బాధ్యతగా తక్షణ ఆర్థిక సహాయం అందించి, వారికి మేమున్నామంటూ భరోసా ఇచ్చారు.ఆయన వెంటగజరా వేణుగోపాల్, భూపతి జయరామయ్య, గౌస్ భాష, గోపి ఉన్నారు.

---

## మానవత్వం తో ఆసుపత్రిలో సేవలందివ్వాలి
## మంత్రి అచ్చెన్నాయుడు

### టెక్కలి జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా టెక్కలి జిల్లా ఆసుపత్రిని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ వార్డులను పరిశీలించిన మంత్రి, రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాలపై ఆరా తీశారు.

వైద్య సేవలు ప్రజలకు మరింత మెరుగ్గా అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సిబ్బంది మానవత్వంతో సేవలు అందించాలని మంత్రి పేర్కొన్నారు.

అస్పత్రిలో మందుల లభ్యత, వైద్యుల హాజరు, పారిశుద్ధ్య పరిస్థితులు, అత్యవసర సేవల నిర్వహణపై మంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. ఇతర సదుపాయాలు ఏమైన అవసరమైతే నివేదిక అందిస్తే సమకూర్చుతానని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు.

## రాజపేటలో అభివృద్ధి పనుల జోరు

### పలు ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

రాజపేట: యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేట మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య సోమవారం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత మండల కేంద్రంలోని పురాతన శివాలయాన్ని సందర్శించిన ఆయన, భక్తుల సౌకర్యార్థం నిర్మించనున్న ఫంక్షన్ హాల్‌కు భూమి పూజ నిర్వహించారు. అనంతరం పుట్ట హనుమాన్ ఆలయ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని, ఆధ్యాత్మిక వాతావరణాన్ని బలోపేతం చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ, ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా నిర్మించిన ల్యాబ్ భవనం, అదనపు తరగతి గదులను ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులకు ఆధునిక సదుపాయాలు కల్పించడం ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని చెబుతూ, విద్యార్థులతో నేరుగా ముచ్చటించి వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం 99 రోజుల 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా వేసవి ఎండల నుండి రక్షణ కోసం విద్యార్థులు, యువతకు ఉచిత సమ్మర్ క్యాప్‌లను పంపిణీ చేశారు. గ్రామీణాభివృద్ధి, విద్య, ఆధ్యాత్మిక రంగాల సమగ్ర వికాసమే ధ్యేయంగా ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కళ్లముందే బూడిదైన మొక్కజొన్న పంట

- ఏం చేయాలో అర్థం కాక కన్నీరుమున్నీరవుతున్న రైతన్న
- ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్య శరణ్యం అంటున్న రైతు కుటుంబం



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి/ రేగొండ మే11

ఆరుగాలం కష్టపడి,అప్పులు తెచ్చి పండించిన పంట,సరిగ్గా ఇంటికి చేరే సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ రూపంలో వచ్చిన ప్రమాదం ఆ రైతు కుటుంబాన్ని చీకట్లోకి నెట్టింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం నర్సింగాపూర్ (రేపాక) గ్రామంలో చోటుచేసుకున్న ఈ అగ్నిప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఘటన వివరాల్లోకి వెళ్తే.. నర్సింగాపూర్ గ్రామానికి చెందిన రైతు కంజుల రమేష్ తనకున్న రెండు ఎకరాల భూమిలో సుమారు రెండు లక్షల రూపాయల వరకు అప్పు తెచ్చి పెట్టుబడిగా పెట్టి మొక్కజొన్న పంటను సాగు చేశారు. వాతావరణం అనుకూలించి పంట బాగా పండటంతో, పంటను కోసి అమ్మితే అప్పులన్నీ తీరిపోతాయని ఆశపడ్డారు.కోత సమయానికి ట్రాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో , మొక్కజొన్న కంకులను కూలీల సహాయంతో తెంపించి చేనులోనే కుప్పలుగా పోసి ఉంచారు.అయితే సోమవారం పొలం మీదుగా వెళ్తున్న విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి పంట కుప్పలకు అంటుకున్నాయి. సమీపంలోని రైతులు మంటలను గమనించి రమేష్‌కు సమాచారం అందించే లోపే, ఎండ తీవ్రతకు మంటలు వేగంగా వ్యాపించి రెండు ఎకరాల్లోని పంటను పూర్తిగా దహించివేసాయి. ఈ ప్రమాదంలో సుమారు 100 క్వింటాళ్లకు పైగా మొక్కజొన్న కంకులతో పాటు,పంటకు అమర్చిన ఖరీదైన డ్రిప్పు పైపులు, విద్యుత్ మోటారు కూడా కాలి బూడిదయ్యాయి. సమాచారం అందుకుని పొలం వద్దకు పరుగున వచ్చిన రమేష్, కళ్లముందే బూడిద కుప్పగా మారిన తన పంటను చూసి ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. "రెండు లక్షల అప్పు తెచ్చి కష్టపడితే, ఇప్పుడు ఆ అప్పులు ఎలా తీర్చాలి? ప్రభుత్వం నన్ను ఆదుకోకపోతే ఉరేసుకోవడం తప్ప మరో మార్గం లేదు" అంటూ ఆయన విలపిస్తున్న తీరు అక్కడి వారిని కలిచివేసింది. నిరుపేద రైతు కంజుల రమేష్‌కు జరిగిన భారీ నష్టాన్ని చూసి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే ఘటనా స్థలాన్ని సందర్శించి పంట నష్టాన్ని అంచనా వేయాలని, మానవీయ కోణంలో స్పందించి రైతుకు ప్రభుత్వం తరఫున తక్షణ ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని, లైన్ల నిర్వహణ సరిగ్గా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.



# బండి సాయి భగీరథపై పోక్సో కేసు
# అరెస్టులో ఆలస్యం పై ఆరోపణలు

తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ మే11



తెలంగాణలో సంచలనం రేపిన కేసులో కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథపై నమోదైన పోక్సో కేసు వివాదాస్పదంగా మారింది. కేసు నమోదైనప్పటికీ ఇప్పటివరకు అరెస్టు జరగకపోవడం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మైనర్ బాలికపై మద్యం తాగించి అత్యాచారం చేసినట్లు ఆరోపణలు ఉన్న ఈ ఘటనలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శకులు ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రజలకు ఒక విధమైన న్యాయం, అధికార వర్గాలకు మరో విధమైన న్యాయం జరుగుతోందని ఆగ్రహం వ్యక్తమవుతోంది. కేసును తప్పుదారి పట్టించేందుకు "హనీ ట్రాప్" కోణంలో చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. వెంటనే నిందితుడిని అరెస్టు చేసి బాధిత బాలికకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.ఇక ఈ ఘటనపై బాధ్యత వహిస్తూ కేంద్రమంత్రి బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేయాలని కూడా కోరుతున్నారు. లేనిపక్షంలో కేంద్ర ప్రభుత్వం ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడంపై కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖ స్పందించకపోవడం దురదృష్టకరమని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ కేసును నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, రాజకీయ ప్రయోజనాల కోసం వాస్తవాలను మళ్లిస్తున్నారని నగేష్ ముదిరాజ్ ఆరోపించారు.

# చిట్టీల పేరుతో రూ.9 లక్షల ఘరానా మోసం


## పిల్లల చదువు కోసం దాచిన సొమ్ము కాజేసిన నిర్వాహకులు

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 11

వరంగల్ జిల్లా:నెలవారి చిట్టీల పేరుతో నమ్మించి తొమ్మిది లక్షల రూపాయలు కాజేసిన ఘటన పర్వతగిరి మండలంలో వెలుగుచూసింది.ఇద్దరు ఆడపిల్లల చదువుల కోసం కష్టపడి దాచుకున్న డబ్బును దగ్గరి వారే మోసం చేయడంతో బాధిత కుటుంబం లబోదిబోమంటోంది. పర్వతగిరి మండలం మాల్యా తండా గ్రామ పంచాయతీ పరిధిలోని హర్జాతండకు చెందిన బానోత్ రమేష్‌ను గూడూరు మండలం గుండెగ గ్రామ పరిధిలోని రామచంద్రుతండ, నర్సంపేటకు చెందిన భానోత్ సందీప్, భానోత్ మంగమ్మ, ధరావత్ సురేష్, ధరావత్ స్రవంతి ఏ సరిత, ఎర్ర రంజిత్ కుమార్, కందగట్ల అనిత అనే ఆరుగురు వ్యక్తులు నెలవారి చిట్టీలు నడిపిస్తున్నామని నమ్మించారు. దగ్గరి సన్నిహితులు కావడంతో నమ్మిన రమేష్ నెలకు ?35 వేల చొప్పున 27 నెలల పాటు మొత్తం ?9 లక్షలకు పైగా చిట్టీ కట్టాడు. చిట్టీ పూర్తయ్యాక డబ్బులు అడిగితే నిర్వాహకులు ఫోన్ లిఫ్ట్ చేయడం లేదు. మోసపోయానని గ్రహించిన బాధితుడు పర్వతగిరి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

"పిల్లల చదువు కోసం దాచాం"


"ఇద్దరు ఆడపిల్లలు. వారి చదువుల కోసం నేను, నా భార్య కూలీనాలీ చేసి రూపాయి రూపాయి కూడబెట్టాం. నమ్మిన వారే నట్టేట ముంచారు" అని బాధితుడు రమేష్ కన్నీటిపర్యంతమయ్యాడు. మోసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను వేడుకున్నాడు. దీనిపై పర్వతగిరి ఎస్సై బి. ప్రవీణ్ కుమార్ స్పందిస్తూ," చిట్ ఫండ్ పేరుతో రూ.9 లక్షలు మోసపోయినట్లు బానోత్ రమేష్ ఫిర్యాదు చేశారు. నిందితులు నర్సంపేట, గూడూరు మండలాలకు చెందిన వారు. బాధితుడు ఫోన్ పే ద్వారా డబ్బులు పంపించాడు.




ప్రస్తుతం నిందితులు ఫోన్‌కు స్పందించడం లేదు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం"అని తెలిపారు.

# బండి సంజయ్ కుమారుడిని తక్షణమే అరెస్ట్ చేయాలి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా : కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలోని సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వెంకట్ రామ్ రెడ్డి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథను తక్షణమే అరెస్ట్ చేయాలని మాజీ ఏఎంసీ ఛైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పిట్లంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చట్టం అందరికీ సమానమని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికార బలంతో తప్పులను కప్పిపుచ్చడం సరికాదని పేర్కొన్న ఆయన, పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి న్యాయం చేయాలని సూచించారు



# అభిమానుల నిరీక్షణకు తెర




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 4న థియేటర్లలోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ఇప్పటివరకు విడుదలైన రెండు పాటలు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. అయితే రామ్ చరణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ట్రైలర్ అప్‌డేట్‌ను మూవీ టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా ట్రైలర్‌ను మే 18న విడుదల చేయబోతున్నట్లు వెల్లడించారు.


అంతేకాకుండా ఒక ఆసక్తికరమైన పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో రామ్ చరణ్ లుక్ నెటిజన్లను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇందులో ఆయన తన వెనుక ఒక మంచాన్ని తగిలించుకుని, ఒక చేతితో ట్రంక్ పెట్టెను, మరో చేతితో వీఐపీ అని రాసి ఉన్న కవర్‌ను పట్టుకుని రైల్వే ట్రాక్‌ను దాటుతూ కనిపిస్తున్నారు. ఈ రా అండ్ రస్టిక్ లుక్ సినిమాపై ఉన్న క్యూరియాసిటీని ఒక్కసారిగా పెంచేసింది. కాగా.. ఈ చిత్రంలో రామ్ చరణ్‌తో పాటు జగపతి బాబు, దివ్యేందు శర్మ, సాయి కుమార్, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ చిత్రం.. ప్రమోషన్ల విషయంలోనూ తగ్గేదే లే అన్నట్లుగా దూసుకుపోతోంది. ఈ విషయాన్ని తెలుసుకున్న మెగా అభిమానులు సోషల్ మీడియాలో తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ పోస్టర్‌ను వైరల్ చేస్తున్నారు. మే 18న రాబోతున్న ట్రైలర్ బాక్సాఫీస్ రికార్డులను తిరగరాయడం ఖాయమని ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# ఓజీ సీక్వెల్‌పై భారీ ప్లాన్!




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో వచ్చిన స్టైలిష్ యాక్షన్ ఎంటర్టైనర్ ఓజీ. పవర్ స్టార్ ఫ్యాన్స్ ఆకలి తీర్చిన ఈ సినిమాకు సీక్వెల్ తెరకెక్కుతోంది. ప్రస్తుతం 'ఓజీ 2' స్క్రిప్ట్ పనుల్లో చాలా బిజీగా ఉన్నాడు సుజీత్. మొదటి భాగంలో కేవలం పవన్ కళ్యాణ్ స్వాగ్ మరియు స్టైల్ తో మ్యాజిక్ చేసిన సుజీత్ ఈసారి కథపై మరింత దృష్టి పెట్టారు. తాజా సమాచారం ప్రకారం ఈ ప్రీక్వెల్ స్టోరీలో సుజీత్ కొత్త క్యారెక్టర్లను పరిచయం చేయబోతున్నారు. జపాన్‌లో 'ఓజాస్ గంభీర' సృష్టించిన అసలు విధ్వంసం ఏమిటి? అతను గ్యాంగ్‌స్టర్‌గా ఎలా ఎదిగాడు? అనే కోణంలో ఈ సినిమా ఉండబోతోంది.

ఇందుకోసం కీలక పాత్రల్లో ప్రముఖ నటీనటులను ఎంపిక చేసే పనిలో సుజీత్ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే 'ఓజీ 2' నిర్మాణ బాధ్యతల నుండి డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్స్ తప్పుకున్నట్లు సమాచారం. దీనికి బదులుగా పీపుల్ మీడియా ఫ్యాక్టరీ మరియు పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సంయుక్తంగా ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మించబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి.నిజానికి సుజీత్ తన తదుపరి చిత్రాన్ని నేచురల్ స్టార్ నానితో 'బ్లడీ రోమియో' చేయాల్సి ఉంది. అయితే నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' షూటింగ్ ఆలస్యం కావడంతో సుజీత్ తన పూర్తి సమయాన్ని 'ఓజీ 2' స్క్రిప్ట్ కోసం కేటాయించారు. నాని డేట్స్ ఖాళీ అయ్యేలోపు 'ఓజీ 2' పనులను ఓ కొలిక్కి తీసుకురావాలని సుజీత్ ప్లాన్ చేస్తున్నారు. మొత్తానికి 'ఓజీ 2' లో సరికొత్త యాక్షన్ ప్యాక్డ్ కంటెంట్ మరియు ఊహించని మలుపులతో సుజీత్ మరోసారి బాక్సాఫీస్ వద్ద తుఫాను సృష్టించడానికి సిద్ధమవుతున్నాడు.



# ఆ పాత్ర నాకు సవాలుగా మారింది

గత ఇరవై ఏళ్లుగా సినీ పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి వేదిక. 'మదరాసి' అనే తమిళ సినిమాతో వెండితెరకు పరిచయమైన ఈ అందాల భామ, ఆ తర్వాత వెనుదిరిగి చూసుకోలేదు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషలతో పాటు హిందీలోనూ నటించి ఫుల్ పాపులారిటీ దక్కించుకుంది. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ ప్రేక్షకులను మెప్పిస్తోంది. ఇటీవల 'ఆడు-3' అనే మలయాళ చిత్రంతో పలకరించిన వేదిక, తాజాగా తన రాబోయే సినిమాల గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. వేదిక ప్రస్తుతం రెండు భారీ తమిళ ప్రాజెక్టులలో నటిస్తోంది. "ప్రస్తుతం నేను రెండు సినిమాల షూటింగ్‌లో బిజీగా ఉన్నాను. అందులో ఒకటి భయపెట్టే హారర్ సినిమా కాగా, మరొకటి అద్భుతమైన ఫాంటసీ కథాంశంతో సాగుతుంది. ఈ రెండు చిత్రాల షూటింగ్ దాదాపు పూర్తికావొచ్చింది" అని వెల్లడించింది.

అయితే ఆ సినిమాల పేర్లను మాత్రం ఆమె బయటపెట్టలేదు. ముఖ్యంగా, ఈ సినిమాల్లో తను చేస్తున్న ఒక పాత్ర తనను చాలా కష్టపెట్టిందని వేదిక చెప్పుకొచ్చింది. "ఆ పాత్ర కోసం నేను మునుపెన్నడూ లేనంతగా శ్రమించాను. నా పరిమితులను దాటి ఆ పాత్రలో ఒదిగిపోవడానికి ప్రయత్నించాను. ఇది నా కెరీర్‌లోనే ఒక మొట్టమొదటి విభిన్నమైన అనుభవం. సినిమా థియేటర్లలోకి వచ్చినప్పుడు ఆ పాత్ర కోసం నేను పడ్డ కష్టం ప్రేక్షకులకు స్పష్టంగా కనిపిస్తుంది" అని ఆమె ఎంతో నమ్మకంగా తెలిపింది. సాధారణంగా సినిమాల్లో అందంగా కనిపించే వేదిక, ఇప్పుడు ఇలా తన నటనకు సవాలు విసిరే పాత్రలను ఎంచుకోవడం చూస్తుంటే, హిట్ కోసం చాలా పకడ్బందీ వేసినట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో బాగా వైరల్ అవుతున్నాయి. దీంతో ఆ రెండు సినిమాలు ఏమిటి? ఆమె అంతగా కష్టపడిన ఆ విభిన్నమైన పాత్ర ఎలా ఉండబోతోంది? అని ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# త్రిష ఓ పరాన్నజీవి



తెలుగు, తమిళ్ ఇండస్ట్రీలలో స్టార్ హీరోయిన్గా చక్రం తిప్పిన బ్యూటీలలో త్రిష ఒకరు. ఈమె ఇప్పటికీ కూడా అద్భుతమైన రీతిలో సినిమా అవకాశాలను దక్కించుకుంటూ కెరీర్‌ను ముందుకు సాగిస్తుంది. తమిళ స్టార్ హీరో విజయ్ మరియు త్రిష ఈమధ్య సన్నిహితంగా ఉంటున్న విషయం తెలిసిందే. విజయ్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చి అద్భుతమైన స్థాయిలో విజయాన్ని అందుకొని తమిళనాడు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కూడా అయ్యారు. నిన్న ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సందర్భంలో కూడా ఈమె హాజరు కావడం జరిగింది. ఇంతలా ఈమె విజయ్‌కు దగ్గరగా ఉంటుండడంతో కొంతమంది ఈ విషయంపై ఘాటుగా స్పందిస్తున్నారు.

ఇక తాజాగా సుచిత్ర కూడా త్రిష గురించి సంచలన వ్యాఖ్యలు చేసింది. సుచిత్ర తాజాగా మాట్లాడుతూ... "నాకు త్రిష అంటే ఏమాత్రం ఇష్టం ఉండదు. విజయ్ అంటే మాత్రం చాలా ఇష్టం, అభిమానం. అందుకే నా అభిప్రాయాన్ని నిష్పక్షపాతంగా చెబుతున్నాను" అంటూ చెప్పింది. విజయ్ ప్రస్తుతం తన తల్లిదండ్రులకు మరియు భార్యకు దూరమై ఒంటరిగా ఉంటున్నారని, ఇలాంటి సమయంలోనే "పరాన్నజీవులు" లాంటి వ్యక్తులు విజయ్ జీవితంలోకి ప్రవేశిస్తున్నారని ఆమె సంచలన వ్యాఖ్యలు చేసింది. విజయ్ ప్రస్తుత ఒంటరితనాన్ని వాడుకొని కొందరు ఆయనకు భారంగా మారుతున్నారని ఈమె వ్యాఖ్యలు చేసింది. తాజాగా సుచిత్ర చేసిన ఈ వ్యాఖ్యలు పెద్ద ఎత్తున వైరల్ అవుతున్నాయి.

# సిద్ధమవుతున్న 'చిచోరా'



టాలీవుడ్ నటుడు నితిన్ తన తదుపరి సినిమాను సీతార ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లో చేయబోతున్నాడు. ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు ఇప్పటికే పూర్తయ్యాయి. నరి, సోమశేఖర్ అనే కొత్త దర్శకులు ఈ సినిమాకి దర్శకత్వం వహించనున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన క్రేజీ అప్‌డేట్‌ను నితిన్ తన సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. ఆయన "hold on boys... CHICHORA getting ready" అంటూ అద్దం ముందు కూర్చొని వెనుక వైపు కనిపించేలా ఉన్న ఫోటోను తన అకౌంట్‌లో పోస్ట్ చేశాడు. దీంతో ఈ సినిమా కోసం నితిన్ పూర్తిగా కొత్త లుక్‌లోకి మారినట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మే 13 నుంచి హైదరాబాద్‌లో ప్రారంభం కానుంది. ఈ చిత్రంలో రితిక నాయక్ హీరోయిన్‌గా నటించనుండగా, సురేష్ బొబ్బిలి సంగీతం అందించనున్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.